RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY | తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 249 ISSUE NO : 249 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | మంగళవారం, మార్చి,31, 2026 Tuesday, March,31, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-

## కేంద్రానికి ఐదు ఉత్తరాది రాష్ట్రాలు సరిపోతాయి

### కేసీఆర్ ను గృహ నిర్బంధం చేశారనేది నా అనుమానం: రేవంత్ రెడ్డి

- రావణుడి వల్లే రాముడి గొప్పతనం తెలిసిందన్న రేవంత్
- కేసీఆర్ ఉండటం వల్ల తనకు గుర్తింపు వచ్చిందని వ్యాఖ్య
- నియోజకవర్గాల పెంపుతో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్న సీఎం



**హైదరాబాద్,మార్చి30,తెలంగాణ దిశ :**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకుంటున్నారని అందరూ భావిస్తున్నారని... కానీ, ఆయన గృహ నిర్బంధంలో ఉన్నారేమో అనేది తన అనుమానం అని అన్నారు. రావణుడి వల్లే రాముడి గొప్పతనం ఏమిటో తెలిసిందని... అలాగే కేసీఆర్ ఉండటం వల్ల తనకు గుర్తింపు వచ్చిందని చెప్పారు.నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ నేత కె. లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. అవి అవగాహన లేని వ్యాఖ్యలని, లక్ష్మణ్ ఎలా డాక్టర్ అయ్యారో అర్థం కావడం లేదని ఘాటుగా విమర్శించారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగినా భౌగోళికంగా గ్యాప్ అలాగే ఉంటుందని, ఈ విషయంలో తెలంగాణను తెలివిగా మోసం చేస్తున్నారని ఆరోపించారు.సీట్ల పెంపు విషయంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోందని అన్నారు. కేంద్రానికి కేవలం ఐదు ఉత్తరాది రాష్ట్రాల సీట్లు సరిపోతాయని, అదే జరిగితే దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.



## ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్..

- దేశవ్యాప్తంగా మరో 11 విమానాశ్రయాల్లో ఉడాన్ యాత్రి కేఫ్‌లు ప్రారంభం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా వర్చువల్ ప్రారంభోత్సవం
- ఈ కేఫ్‌లలో రూ.10కే టీ, వాటర్ బాటిల్, రూ.20కే స్నాక్స్

విమాన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. విమానాశ్రయాల్లో అధిక ధరలకు చెక్ పెడుతూ, ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అత్యంత చౌక ధరలకే అందించేందుకు ఏర్పాటు చేసిన "ఉడాన్ యాత్రి కేఫ్"ల సేవలను మరింత విస్తరించింది.తాజాగా దేశంలోని మరో 11 విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కేఫ్‌లలో టీ, కాఫీ, సమోసా, వాటర్ బాటిల్ వంటివి కేవలం రూ.10 నుంచే లభించనున్నాయి.

## గణపతి వెంటనే లొంగిపోవాలి

### మావోయిస్టు అగ్రనేత గణపతికి తెలంగాణ డీజీపీ కీలక సూచన

**హైదరాబాద్,మార్చి30,తెలంగాణ దిశ :**




దేశంలో మావోయిజం నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం విధించిన మార్చి 31 డెడ్‌లైన్ మరికొన్ని గంటల్లో ముగియనున్న నేపథ్యంలో, తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మావోయిస్టులకు కీలక పిలుపునిచ్చారు. హింసా మార్గాన్ని విడనాడి, జనజీవన స్రవంతిలో కలిసి గౌరవప్రదమైన జీవితం గడపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మాకు అవసరం లేదు

### మధ్యవర్తిత్వం వహిస్తానన్న పాకిస్థాన్‌కు ఇరాన్ షాక్

**ఇంటర్నెట్ డెస్క్,మార్చి30**



అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించడానికి ప్రత్యక్ష చర్చలకు ఆతిథ్యం ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ చేసిన ప్రకటనపై ఇరాన్ స్పందించింది. పాకిస్థాన్ నేతృత్వంలో జరిపే సంధి ప్రయత్నాలలో తమ ప్రమేయం ఏమీ లేదని ఇరాన్ స్పష్టం చేసింది.



## దక్షిణ సూడాన్‌లో నరమేధం

- దక్షిణ సూడాన్‌లో బంగారు గనిపై సాయుధుల దాడి
- ఈ ఘటనలో 70 మందికి పైగా పౌరులు మృతి
- రాజధాని జుబా సమీపంలోని జెబెల్ ఇరాక్ గని వద్ద ఘటన

**ఇంటర్నెట్ డెస్క్,మార్చి30**

దక్షిణ సూడాన్‌లో మారణహోమం చోటుచేసుకుంది. రాజధాని జుబాకు సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న జెబెల్ ఇరాక్ బంగారు గని వద్ద గుర్తుతెలియని సాయుధ దుండగులు జరిపిన దాడిలో 70 మందికి పైగా పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల సంఖ్య 85 వరకు ఉండొచ్చని కొన్ని అనధికారిక వర్గాలు చెబుతున్నాయి.

## రూపాయి భారీ పతనం..

### డాలర్ మారకంతో 95 స్థాయికి పడిపోయిన రూపాయి

**న్యూఢిల్లీ,మార్చి30,**

భారత కరెన్సీ రూపాయి సోమవారం నాడు డాలర్ మారకంతో ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయ పరిణామాలతో రూపాయి రోజురోజు నష్టపోతోంది. ఈరోజు డాలర్ మారకంతో 95.14 వద్ద కనిష్ఠస్థాయికి పడిపోయింది.



## నామినేషన్ దాఖలు చేసిన ముఖ్యమంత్రి స్టాలిన్

- నాలుగోసారి కొళత్తూరు నుంచి పోటీ చేస్తున్న సీఎం స్టాలిన్
- ఢిల్లీకి వ్యతిరేకంగా తమిళనాడు పోరాడుతోందన్న ముఖ్యమంత్రి

**ఇంటర్నెట్ డెస్క్,మార్చి30**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, టీవీకే అధ్యక్షుడు విజయ్ నామినేషన్లు దాఖలు చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ వరుసగా మూడుసార్లు కొళత్తూరు నియోజకవర్గం నుంచి గెలుపొందారు.



## దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన

### 'సహజీవన జంటలకు' కూడా కుటుంబ హోదా

**న్యూఢిల్లీ,మార్చి30,**

భారతదేశ జనాభా లెక్కల సేకరణలో కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. 2021లో కోవిడ్ కారణంగా వాయిదా పడిన 16వ జనగణన ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1న ప్రారంభం కానుంది. ఈసారి జనాభా లెక్కల్లో మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలను సవరించారు.




## నామినేషన్ వేసిన విజయ్

### తమిళనాడు రాజకీయాల్లో కీలక ఘట్టం

తమిళనాడు రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో ప్రవేశించిన ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్, సోమవారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.





## రేవంత్ ప్రభుత్వంలో భూ కబ్జాల పర్వం

- రూ. 1,400 కోట్ల విలువ చేసే 27 ఎకరాల భూమిపై పొంగులేటి కన్ను పడిందని ఆరోపణ
- పొంగులేటి తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్,మార్చి30,తెలంగాణ దిశ :**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ భూ కబ్జాల పర్వం కొనసాగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో ఈరోజు ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.వట్టినాగులపల్లిలో సతీశ్ షా కుటుంబానికి చెందిన 27 ఎకరాల భూమిపై మంత్రి పొంగులేటి కన్ను పడిందని కేటీఆర్ ఆరోపించారు. సుమారు రూ. 1,400 కోట్ల విలువ చేసే ఈ భూమిని దక్కించుకోవడానికి జేసీబీలతో వచ్చి గోశాలను, కాంపౌండ్ వాల్‌ను కూల్చివేశారని మండిపడ్డారు.



## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

**ఇంటర్నెట్ డెస్క్,మార్చి30**

ఈ ఆర్థిక సంవత్సరం చివరి ట్రేడింగ్ రోజున భారత స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో ముగిశాయి. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా నెలకొన్న ఆందోళనలు దేశీయ సూచీలపై తీవ్ర ప్రభావం చూపాయి

## ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం..

**కేరళ,మార్చి30,**

కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయ విమర్శల పదును పెంచారు. రాష్ట్రంలో అధికార ఎల్డీఎఫ్ (వామపక్ష కూటమి) - కేంద్రంలోని బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పత్తనంతిట్ట జిల్లా అదూర్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ... కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కేవలం వామపక్షాలతోనే కాకుండా, 'ఎల్డీఎఫ్-బీజేపీ' కూటమితో కూడా పోరాడుతోందని అన్నారు.



మల్కాజిగిరి 2 MALKAJGIRI Volume : 3 Issue No. 249 తెలంగాణ దిశ Tuesday, March,31, 2026 మంగళవారం, మార్చి,31, 2026

# బిజెపి పాలిత రాష్ట్రాలలో మహిళలకు కరువైన భద్రత

## - మహిళా మేడ్చల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి




**కుత్బుల్లాపూర్, మార్చి 30, (తెలంగాణ దిశ)** :బీజేపీ పాలిత రాష్ట్రాలలో మహిళలకు భద్రత లేదని మహిళా మేడ్చల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి ఆరోపించారు. సోమవారం కుత్బుల్లాపూర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ "బేటీ పడావో, బేటీ బచావో" నినాదం అమలులో లేదని పేర్కొన్నారు. మహిళలపై నేరాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కేంద్రంలోని పెద్దలు నిందితులను కాపాడుతున్నారని ఆమె ఆరోపించారు. మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబ సూచనల మేరకు, రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశాల మేరకు మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలు, బాలికలపై పెరుగుతున్న నేరాలు ఆందోళనకరంగా మారాయని పేర్కొన్నారు. కొన్ని కేసుల్లో నిందితులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రక్షణ కల్పిస్తున్నట్లు ఆరోపించారు. "బేటీ పడావో -- బేటీ బచావో" అనే నినాదం పనిచేయడం లేదన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ మహిళల భద్రత విషయంలో విఫలమయ్యారని విమర్శించారు. బీజేపీ పాలనలో మహిళలకు సరైన రక్షణ లేదని, మహిళలపై నేరాలకు పాల్పడిన కొందరు ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోకుండా వారిని కాపాడుతున్నారని ఆరోపించారు. మహిళలను గౌరవించని ప్రభుత్వానికి పాలన చేసే అర్హత లేదని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అరాచకాలను అరికట్టడంలో కేంద్రం విఫలమైందని ఆమె తీవ్రంగా విమర్శించారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం తప్పుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళల భద్రతకు హామీ ఇవ్వాలని మహిళా కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి, సహాయ కార్యదర్శి సరస్వతి, డివిజన్ అధ్యక్షురాళ్లు స్వాతి, మాధవి, కమల, తులసి, సుజాత, సుజాత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి పేరు

## - ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హర్షం



**ఉప్పల్, మార్చి 30, (తెలంగాణ దిశ)** :ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మితమవుతున్న ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి కారిడార్ నామకరణం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు104పై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సంబంధిత అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బండారి రాజిరెడ్డి చేసిన సేవలను స్మరించు కుంటూ ఈ నామకరణం చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ఇది కీలక ముందడుగని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం సహకారం అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో 50 సంవత్సరాల అనుబంధం ఉందన్నారు. తన తల్లి మల్లాపూర్ గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ తరపున వార్డు సభ్యురాలిగా సేవలందించారని తెలిపారు. తన అన్న, కీర్తిశేషులు బండారి రాజిరెడ్డి కాప్రా మున్సిపల్ చైర్మన్‌గా, ఉప్పల్ తొలి ఎమ్మెల్యేగా, అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యునిగా ప్రజలకు సేవలందించిన విషయాన్ని గుర్తుచేశారు. 2019లో మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి విజయం కోసం రాజిరెడ్డి అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. 2014లో కాంగ్రెస్ తరఫున ఉప్పల్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయానని, అనంతరం 2023లో కె. చంద్రశేఖర రావు నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీ నుంచి తనకు టికెట్ లభించిందన్నారు. ఉప్పల్ నియోజకవర్గానికి రాజిరెడ్డి అందించిన సేవలను గుర్తించి ఆయన పేరును ఎలివేటెడ్ కారిడార్‌కు పెట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిలకు కుటుంబ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# మేడ్చల్ జిల్లాలో బాలికలకు హెచ్ పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభం





**కీసర, మార్చి 30, (తెలంగాణ దిశ)** :జిల్లాలోని రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్, హాస్టల్స్, స్కూల్స్‌లో 14--15 సంవత్సరాల వయసు గల బాలికలకు హెచ్ పీవీ వ్యాక్సినేషన్ అందించేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కోరారు. సోమవారం కీసర మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భాశయ క్యాన్సర్ నివారణ లక్ష్యంగా బాలికలకు హెచ్ పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యాక్సిన్ డోసుల వివరాలను తెలుసుకుని, వ్యాక్సిన్ తీసుకున్న బాలికలకు హెచ్ పీవీ వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లాలోని బిసి, ఎస్సీ, మైనారిటి రెసిడెన్షియల్ స్కూల్స్, హాస్టల్స్‌లోని అన్ని బాలికలకు వ్యాక్సినేషన్ అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య అధికారికి సూచించారు. సంబంధిత శాఖల సమన్వయంతో ప్రతి బాలికను మొబిలైజ్ చేసి వ్యాక్సిన్ ఇవ్వాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 24/7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా ఈ వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్న వారిని, ఇబ్బందుల్లో ఉన్న వారిని గుర్తించి వారికి కూడా వ్యాక్సిన్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో తల్లిదండ్రులు, బాలికల్లో అవగాహన పెంచి స్వచ్ఛందంగా వ్యాక్సిన్ తీసుకునేలా చూడాలని తెలిపారు. అనంతరం పిహెచ్‌సి సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్, అవసరమైన మరమ్మత్తులపై వివరాలు తెలుసుకుని, అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. మందుల గదిని పరిశీలించి, ఎక్స్ పైరీ డేట్లను తనిఖీ చేసి మందులు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీఓ రాజేష్, జిల్లా డీఎంహెచ్ఓ ఉమాగౌరి, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, కౌశిక్ పీఓ, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ అనుమతులు రద్దు చేయాలి

## - జీహెచ్‌ఎంసీ అధికారులకు బాధితుడి విన్నపం




**కాప్రా, మార్చి 30, (తెలంగాణ దిశ)** :వివాదాస్పద స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా పొందిన భవన నిర్మాణ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని బాధితుడు ఎం. చంద్రశేఖర్ రెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్, కాప్రా డిప్యూటీ కమిషనర్‌లను విజ్ఞప్తి చేశారు. వాస్తవాలను కప్పిపుచ్చి, కోర్టు కేసులను మరుగున పెట్టి పొందిన అనుమతులపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కుషాయిగూడ గ్రామకంఠంలోని ఇంటి నెం. 1-9-337 గల 110 చదరపు గజాల స్థలంలో తనకు సగం వాటా ఉందని, దీనిపై మల్కాజిగిరి కోర్టులో (ఓఎస్ నెంబర్. 929/2021) విభజన దావా పెండింగ్‌లో ఉందని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. అయితే, తన సోదరుడు యాదిరెడ్డి మరియు అతని కుమార్తె సింగిరెడ్డి సౌజన్య తప్పుడు పత్రాలు సృష్టించి ఆస్తిని కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎలాంటి అనుమతులు లేకుండానే అక్కడ పాత నిర్మాణాలను కూల్చివేసి, "ఆస్వాద్ క్విక్ బైట్స్" పేరిట హోటల్ నిర్వహించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయించగా (డబ్ల్యు పి నెంబర్. 1881/2023), అక్రమ నిర్మాణాలు ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీకి కోర్టు ఆదేశించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తాజాగా, అదే స్థలంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టేందుకు సింగిరెడ్డి సౌజన్య జీహెచ్‌ఎంసీ నుంచి (పర్మిట్ నెంబర్. 4463/జీపీ/కాప్రా/సి/2025) అనుమతి పొందినట్లు తెలిసిందని తెలిపారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా, తాము అభ్యంతర పత్రం జీహెచ్‌ఎంసీకి సమర్పించినప్పటికీ అధికారులు అనుమతులు ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. తప్పుడు సమాచారంతో పొందిన ఈ అనుమతులను వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో తనకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బాధితుడు విన్నవించారు. ఈ మేరకు ఫిర్యాదు ప్రతులు, కోర్టు ఉత్తర్వులను సంబంధిత అధికారులకు అందజేశారు.

# చర్లపల్లిలో సీజింగ్ భవన నిర్మాణ దారులపై కేసు నమోదుకు సిఫారసు

## - నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం
## - సీజ్ చేసిన భవనంలో పనులు..!?



**చర్లపల్లి, మార్చి 30, (తెలంగాణ దిశ)** :చర్లపల్లి నిర్మాణ దారులపై కేసు చేయాలని కోరుతూ కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణమూర్తి చర్లపల్లి సర్కిల్ ఇన్ స్పెక్టర్ కు లేఖ రాశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టడంతో పాటు నిర్మాణంపై అనేక ఫిర్యాదులు రావడంతో అప్పటి జిహెచ్ఎంసి అధికారులు భవనాన్ని రెండు సార్లు సీజ్ చేసిన విషయం విధితమే. భవనాన్ని సీజ్ చేసినప్పటికీ యదేచ్ఛగా పనులు కొనసాగిస్తుండడంతోపాటు గ్రౌండ్ ఫ్లోర్ లో కమర్షియల్ షెటర్లు, అదనపు అంతస్తు నిర్మాణం చేపట్టడం పట్ల అధికారులు పలుసార్లు నోటీసులు అందజేశారు. రెండు భవనాలకు అనుమతులు తీసుకొని ఎలాంటి సెట్ బ్యాక్స్ లేకుండా నిర్మాణాలు జరుపుతున్నారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. అయినప్పటికీ భవన నిర్మాణదారులు పనులను పూర్తికానిచ్చారు. ఈ నేపథ్యంలో భవన యజమానులు ముఖేష్, పునీత్ రామ్ లపై కేసు నమోదు చేయాలని కోరుతూ లేఖ రాశారు.

# వికలాంగులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలను కోరుతూ ధర్నా






**కుషాయిగూడ, మార్చి 30, (తెలంగాణ దిశ)** :వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వికలాంగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఈసీఐఎల్ చౌరస్తాలో నిరసన కారులు బడ్జెట్ పత్రాలను దహనం చేసి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026--27 బడ్జెట్‌లో వికలాంగులకు ప్రత్యేక బడ్జెట్ తో పాటు తగిన నిధులు కేటాయించకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగుల అవసరాలను విస్మరించడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం వికలాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కడలి నాగలక్ష్మి మాట్లాడుతూ, వికలాంగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం బాధాకరమని అన్నారు. వికలాంగుల భవిష్యత్తు మెరుగుపడాలంటే ప్రత్యేక బడ్జెట్‌తో పాటు ఉపాధి, ఉద్యోగాలు, ఆరోగ్య సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఉపాధ్యక్షుడు బాలయ్య మాట్లాడుతూ తమ హక్కుల కోసం రోడ్డెక్కి నిరసన తెలపాల్సిన పరిస్థితి రావడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో షహీన్ బేగం, రజిత, నాగరాజు, శివ, మన్నన్, బాలాజీ, అనిల్, ప్రేమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన







**కీసర, మార్చి 30, (తెలంగాణ దిశ)** :ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ప్రాంతీయ కార్యాలయం మేడ్చల్ ఆధ్వర్యంలో కీసరలోని భోగారం హోలీ ట్రినిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ కాలేజీలో "సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పండి" అనే అంశంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ జి.లింగయ్య పాల్గొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలు మరియు దాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. కొంతమంది విద్యార్థులు ప్రసంగిస్తూ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే సందేశాలతో పోస్టర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, పర్యావరణ ఇంజనీర్ బి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అరైవ్ అలైవ్ క్యాంపెయిన్‌లో భాగంగా డ్రైవర్లకు ప్రత్యేక కంటి పరీక్షలు



**కుషాయిగూడ, మార్చి 30, (తెలంగాణ దిశ)** :రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు అరైవ్ అలైవ్ క్యాంపెయిన్--2026 ఫేజ్--3లో భాగంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం డ్రైవర్లకు ప్రత్యేక కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ డిఐ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వాహన డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని తెలిపారు. ముఖ్యంగా లారీలు, బస్సులు వంటి భారీ వాహనాలను నడిపే వారికి స్పష్టమైన దూర దృష్టి, పక్కదృష్టి, లోతు గ్రహింపు ఎంతో కీలకమని పేర్కొన్నారు. రోడ్డు సూచనలు, ట్రాఫిక్ సిగ్నల్స్, అడ్డంకులను సమయానికి గుర్తించేందుకు మంచి దృష్టి అవసరమని ఆయన వివరించారు. క్యాటరాక్ట్, గ్లాకోమా వంటి కంటి వ్యాధులు ప్రారంభ దశలో లక్షణాలు లేకుండానే వస్తాయని, కాబట్టి పర్యాయ కంటి పరీక్షల ద్వారా ముందుగానే గుర్తించి చికిత్స పొందవచ్చని సూచించారు. ఈ శిబిరంలో పలువురు వాహన డ్రైవర్లు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ ఎన్. సుధాకర్ రెడ్డి, ఎస్సైలు ఎన్. వెంకన్న, ఎం. విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో, ప్రజల ప్రాణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు.

# బండారి రాజిరెడ్డి కారిడార్ ప్రకటనతో చక్రిపురంలో సంబరాలు

**చర్లపల్లి, మార్చి 30, (తెలంగాణ దిశ)** : తెలంగాణ ప్రభుత్వం ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మితమవుతున్న ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి కారిడార్ గా నామకరణం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ చక్రిపురం చౌరస్తాలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం సంబరాలు నిర్వహించారు. మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసింది. ఉప్పల్ నియోజకవర్గ ప్రజల అభ్యర్థన మేరకు బండారి రాజిరెడ్డి జ్ఞాపకార్థం ఈ పేరు నిర్ణయించడం పట్ల స్థానిక ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రక నిర్ణయంపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి చర్లపల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నేమూరి మహేశ్ గౌడ్ ఆధ్వర్యంలో చక్రిపురం చౌరస్తాలో బండారి రాజిరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంచుతూ సంబరాలు జరిపారు. కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ నిర్ణయం బిఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని నాయకులు తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారుడు తాడూరి గగన్ కుమార్ ముందస్తు అరెస్ట్



**ఏఎస్ రావునగర్, మార్చి 30, (తెలంగాణ దిశ)** :తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మీడియా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్‌ను పోలీసులు సోమవారం ఉదయం ముందస్తు అరెస్ట్ చేశారు. ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో ఫోరం సభ్యులు అసెంబ్లీ ముట్టడికి సిద్ధమవుతున్నారనే సమాచారంతో ముందస్తు చర్యగా పోలీసులు ఈ అరెస్ట్ చేసినట్లు తెలిసింది. జవహర్ నగర్ పోలీసులు ఉదయం సుమారు 6 గంటల సమయంలో గగన్ కుమార్ నివాసానికి చేరుకుని ఆయనను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఆయనను విడుదల చేశారు. అయితే ఇటీవల ఫోరం అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి చర్చలు జరిపిన నేపథ్యంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లభించడంతో నేటి అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఫోరం ప్రతినిధులు తెలిపారు. అయినప్పటికీ, ఉద్యమకారులు ముట్టడికి ప్రయత్నించే అవకాశం ఉందనే అనుమానంతో ఫోరం సభ్యులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారని సమాచారం. ప్రభుత్వం హామీల అమలులో ఆలస్యం చేస్తే, వాయిదా పడిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని త్వరలోనే నిర్వహిస్తామని తాడూరి గగన్ కుమార్ స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## అమెరికాను మించి ఇజ్రాయెల్..!

భారత ప్రధాని నరేంద్రమోదీ రెండు రోజుల పర్యటన కోసం ఇజ్రాయెల్ వెళ్లారు. ఈ పర్యటన భారత్‌కు అతి కీలకమైనదిగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారత్?ఇజ్రాయెల్ సంబంధాలు కేవలం ఆధునిక ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాదు.. దశాబ్దాలుగా రహస్య సహకారంతో ముడిపడి ఉన్నాయి. ఈ దౌత్య బంధం రక్షణ, సాంకేతికతల్లో కీలక పాత్ర పోషిస్తోంది.దౌత్య సంబంధాలు లేనప్పటికీ ఇజ్రాయెల్ 1971లో భారత్‌కు ఆయుధాలు, శిక్షణ అందించి అమెరికా ఒత్తిళ్లను ఎదిరించింది. ఈ రహస్య చర్య భారత విజయానికి ముఖ్య కారణమైంది. ఇది రెండు దేశాల మధ్య విశ్వాసానికి మొదటి గుర్తింపు.ఇక 1980లో పాకిస్తాన్ అణు కార్యక్రమాన్ని ఆపేందుకు ఇజ్రాయెల్ ధ్వంసా అధికారం సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదన భారత భద్రతా ఆందోళనలను పరిష్కరించే స్ఫూర్తిని చూపింది. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు రెండు దేశాలను వ్యూహాత్మకంగా దగ్గర చేశాయి. ఇరు దేశాల బంధాన్ని బలోపేతం చేశాయి.ఇక ఇటీవల ఆపరేషన్ సిందూర్‌కు ఇజ్రాయెల్ పూర్తి మద్దతు ఇచ్చింది. పాకిస్తాన్‌కు టర్కీ డ్రోన్లు అందించింది. వాటితో భారత్‌పై పాకిస్తాన దాడికి యత్నించింది. అదే సమయంలో ఇజ్రాయెల్ భారత్ యాంటీ డ్రోన్ టెక్నాలజీ అందించింది. దీంతో భారత సైన్య పాకిస్తాన్ డ్రోన్లను సమర్థవంతంగా తిప్పికొట్టింది. నెతన్యాహు గతంలో ఐక్యరాజ్యసమితిలో వాషింగ్టన్ కంటే ఢిల్లీనే ఎక్కువగా నమ్ముతామని చెప్పారు. రక్షణ, వ్యవసాయం, అఐ రంగాల్లో సహకారం ఇప్పుడు అభివృద్ధి చెందుతోంది.ఈ చరిత్రాత్మక సంఘటనలు రెండు దేశాల సంబంధాన్ని విశ్వాసంతో బలపరుస్తున్నాయి. భవిష్యత్తులో సైబర్ భద్రత, డ్రోన్ సాంకేతికతల్లో మరిన్ని భాగస్వామ్యాలు ఆశిస్తున్నాయి. ఇది భారత్ మధ్యప్రాచ్య వ్యూహంలో కీలకమవుతుంది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు భారతీయ సంప్రదాయ దుస్తులు ధరించి కలిశారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక ఎయిర్‌పోర్టులో నెతన్యాహు భార్య కాషాయ రంగు దుస్తులు ధరించి వచ్చింది. ఇలాంటి నేపథ్యంలో మోదీ పర్యటనపై ఒకవైపు సానుకూల విశ్లేషణలు వస్తుండగా కొందరు ఈ పర్యటనతో భారత్‌కన్నా ఎక్కువగా నెతన్యాహుకే లబ్ధి కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు. మోదీ పర్యటన వెనుక రాజకీయ లక్ష్యాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు.గతంలో భారత్ ? ఇజ్రాయెల్ మధ్య సత్సంబంధాలు ఉండేవి కావు. పాలస్తీనాపై వ్యతిరేకత కారణంగా భారత్ ఇజ్రాయెల్‌ను దూరంగా ఉంచింది. అయితే పీవీ నర్సింహారావు పాలనలో దౌత్య సంబంధాలు ఏర్పడ్డాయి. బీజేపీ, సంఘ్ పరివార్ మొదటి నుంచి ఇజ్రాయెల్ అనుకూలంగా ఉ నానయి. ఇజ్రాయెల్ ముస్లిం దేశాలకు వ్యతిరేకంగా యుద్ధాలు చేస్తుంది. అందుకే బీజేపీ, సంఘ్ ఇష్టపడతాయి.మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రక్షణ, సాంకేతికతల్లో భారత్?ఇజ్రాయెల్ బంధం బలపడింది. తాజా పర్యటనలో ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్)లో ప్రసంగం చారిత్రకం. అయితే, విపక్షం ప్రభుత్వ వ్యతిరేకతతో బహిష్కరణ ప్రకటించింది.నెతన్యాహు బలహీన స్థితిలో ఉన్నారు. ఎన్నికలు జరిగితే ఓటమి అవకాశం ఎక్కువ. అవినీతి ఆరోపణలు, జుడీషియల్ సంస్కరణలపై ప్రతిపక్షుల వ్యతిరేకత, హమాస్ దాడి ముందు పదవి కోల్పోయే పరిస్థితి. ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాలు వ్యతిరేకులు, సౌత్ ఆఫ్రికా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి అరెస్ట్ వారెంట్ కోరిందినెతన్యాహు మోదీ ఆహ్వానంతో తన ఇమేజ్‌ను మెరుగుపరచుకోవాలని భావించారు. భారత్ ప్రధాని సందర్శన ఆయనకు దేశీయ, అంతర్జాతీయ గౌరవాన్ని పెంచుతుంది. ఈ ప్రాంతంలో చర్చలు ? శాంతియుత పరిష్కారాలకు భారతదేశం నిరంతర మద్దతు తెలుపుతుందని, ఉద్రిక్తతలను తగ్గించడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రధాన మంత్రి మోదీ వెల్లడించారు. శాంతికి మార్గంగా గాజా శాంతి ప్రణాళికను ఆయన ప్రత్యేకంగా స్వాగతించారు. స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి భారత్ పూర్తిగా మద్దతు ఇస్తుందని, మానవాళి ఎప్పుడూ సంఘర్షణ బాధితురాలిగా మారకూడదని పేర్కొన్నారు. ఉమ్మడి మీడియా సమావేశంలో, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రధాన మంత్రి మోదీ పర్యటనను అద్భుతమైనదిగా, అసాధారణంగా అభివర్ణించారు. తక్కువ వ్యవధి ఉన్నప్పటికీ, ఇది చాలా హృదయాన్ని కదిలించేదన్నారు.అంతకుముందు రోజు పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం భావోద్వేగ ప్రభావాన్ని ఆయన ప్రశంసించారు. అది ఇజ్రాయెల్‌లోని ప్రతి ఒక్కరి కళ్ళలో కన్నీళ్లు తెప్పించలేదని అన్నారు. కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ, నెతన్యాహు ఇజ్రాయెల్ భారతదేశం అచంచలమైన స్నేహానికి ఎంతో రుణపడి ఉందని అన్నారు. రెండు దేశాల మధ్య వ్యక్తిగత సంబంధాలను ప్రతిబింబిస్తూ, వారి వివాహానికి ముందు టెల్ అవీవ్‌లోని ఒక భారతీయ రెస్టారెంట్‌లో తన భార్య సారాతో అద్భుతమైన భోజనాన్ని ఆస్వాదించడం గురించి వ్యక్తిగత కథను పంచుకున్నారు.రెండు దేశాల మధ్య ప్రతిభావంతులు, ఆలోచనలు, భావాలు సమావేశమయ్యే అవకాశాలను ఇజ్రాయెల్ నాయకుడు నెతన్యాహు ప్రస్తావించారు. ఈ సంబంధం కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. భారతదేశంలో త్వరలో ప్రభుత్వానికి మధ్య ప్రభుత్వానికి సమావేశం నిర్వహించే ప్రణాళికలను ఆయన ప్రకటించారు. మరిన్ని చర్చలకు ప్రముఖ మంత్రులను ఆహ్వానించే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.అయితే, ఇరాన్‌పై అమెరికా దాడి సందర్భంలో ఇజ్రాయెల్ మద్దతు, గల్ఫ్ దేశాల ఒత్తిళ్లు భారత్‌ను కష్ట పరిస్థితిలో ఉంచవచ్చు.మోదీ పర్యటన భారత్ మధ్యప్రాచ్య వ్యూహాన్ని ప్రభావితం చేస్తుంది. ఇరాన్ వ్యతిరేక చర్యలకు మద్దతుగా కనిపించడం దీర్ఘకాలంలో దక్షిణ ఆసియా సంబంధాలను దెబ్బతీస్తుంది. రెండు దేశాల సహకారం లాభదాయకమైనా, భౌగోళిక రాజకీయాలు జాగ్రత్తలు పాటించాలి.

# వినాయక్ నగర్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి కృషి

**- కాప్రా మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజు శివమణి**





**కాప్రా, మార్చి 30, (తెలంగాణ దిశ)** :కాప్రా డివిజన్‌లోని వినాయక్ నగర్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను చేపడతానని కాప్రా మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజు శివమణి తెలిపారు. సోమవారం ఆయన కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ప్రస్తావించిన సమస్యలను విన్న ఆయన, మిగిలి ఉన్న లేన్లలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించి నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు, త్రాగునీటి సదుపాయం వంటి పలు అభివృద్ధి పనులు గతంలోనే చేపట్టినట్లు గుర్తుచేశారు. అలాగే ప్రధాన రహదారి వెంట మురుగునీరు పొంగిపొర్లుతున్న సమస్య పరిష్కారానికి రూ. 1.75 కోట్లతో భూగర్భ బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించగా, జోనల్ కమిషనర్ ఆమోదం తెలిపారని చెప్పారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. మాజీ కార్పొరేటర్ హామీపై వినాయక్ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తిరుపతి ఎస్వీ జూపార్క్‌కు అరుదైన వన్యప్రాణులు

**పరస్పర మార్పిడితో జంతువుల రాక**





**తిరుపతి:,తెలంగాణ దిశ** :తిరుపతి ఎస్వీ జూపార్కుకు త్వరలో అరుదైన వన్యప్రాణు లు రానున్నాయి. విశాఖ జూపార్కు,హైదరాబాదు జూపార్కు, చెన్నైలోని క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు, గుజరాత్ రాష్ట్రం జాంనగర్‌లోని గ్రీన్స్ జువాజికల్ రెస్క్యూ అండ్ రిహాబిటేషన్ సెంటర్ నుంచి మొత్తం 61 వన్యప్రాణులు తిరుపతికి రానున్నాయి. పరస్పర వన్యప్రాణి మార్పిడి విధానం ద్వారా వీటిని తెప్పించనున్నట్లు ఇక్కడి జూ అధికారులు చెప్పారు. తిరుపతినుంచి గరియల్–2, ఇండినగ్ గౌడ్–2,
జపనీస్ కోయల్ –4, మస్కోవి డెక్ –4, గే పిలికాన్ –2, వైటఖ్ ఈబీస్ 2 హైదరాబాద్ లోని నెహ్రూ జులాజికల్ పార్కుకు పంపిస్తారు. అక్కడినుంచి మగ్గర్ క్రోకోడైల్స్ –4, ఇండియన్ మౌస్ డీర్–6, రింగ్ నెక్కుడ్ పీసెంట్ –2, గో÷–డలెన్ పీసెంట్–2, సిల్వర్ పీసెంట్ –1, రెడ్ జంగిల్ ఫోవల్ –2, జంధ్యాకోనూరే 2 ఇక్కడికి రానున్నాయి. మద్రాస్ క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు నుంచి మొసళ్లు–5, ఉప్పునీటి మొసళ్లు 2, ఎల్లో అనకొండ–9 ఎస్వీ జూపార్కుకు రానున్నాయి. విశాఖలోని ఇందిరాగాంధీ జువాజికల్ పార్కు నుంచి ఒక తెల్లపుల్లి ఎస్వీ జూపార్కుకు రానుండగా ఇక్కడున్న తెల్లపులిని వారికి పంపిస్తారు. రెండు అడవికుక్కలు,
ఒక తోడేలు, రెండు జింకలు, బూడిదరంగు అడవికోళ్లు రెండు విశాఖ జూకు పంపించనున్నారు. దానికి బదులుగా అక్కడి నుంచి ఒక తోడేలు, రెండు అడవికుక్కలు, రెండు అడవిపిల్లులు, రెండు నీల్‌గై, నాలుగు గ్రీన్ ఇగ్వనాలను తిరుపతి జూపార్కుకు అందజేయనున్నారు. జామ్‌నగర్‌కు తెల్లపులి ఒకటి, ఇండియన్ గౌర్ రెండు, బ్లాక్ బక్–10, సాంబార్–10, బార్కింగ్ డీర్–2, మస్క్వెడక్–2, జాగ్వర్ ఒకటి అందజేస్తారు.

# నాగారంలో విద్యుత్ ఆర్టిజన్ల ధర్నా



**కీసర, మార్చి 30, (తెలంగాణ దిశ)** :తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నాగారంలోని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద ఆర్టిజన్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కీసర డివిజన్ జేఏసీ చైర్మన్ మహమ్మద్ జహంగీర్, కన్వీనర్ సాగంటి సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్టిజన్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, వేతనాలు, ఇతర సౌకర్యాల విషయంలో అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో కో– చైర్మన్ శిఖ ఆంజనేయులు, కో–కన్వీనర్ రామస్వామి, సభ్యులు ఇందిరా, సంగీత, రమేష్, సయ్యద్ అజిముద్దీన్, వెంకటేష్, రాజు, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు. అలాగే మీటర్ లీడర్స్ సురేందర్ బాబు, బాల ప్రసాద్, మహమ్మద్ శంషొద్దీన్, జి. లక్ష్మణ్, రంజిత్, బిల్ కలెక్టర్లు రవి, రామకృష్ణ, శ్రీనివాస్, విజయ్ తదితరులు హాజరయ్యారు.



# జనసేన మెంబర్ షిప్ డ్రైవ్

**కాకినాడ,తెలంగాణ దిశ** : జనసేన .. జనం కోసమే పార్టీ అన్నది పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నినాదం. పార్టీ పెట్టి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు పవన్. ఎంత కూటమిలో ఉన్నప్పటికీ పార్టీని బలోపేతం చేసుకోవాల్సి ఉ ందన్న సత్యాన్ని గుర్తించిన పవన్.. ఆదిశగా శరవేగంగా అడుగులేస్తున్నారు. సంస్థాగతంగా పార్టీని పటిష్ఠం చేయడమే లక్ష్యంగా, 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్' అనే శక్తిమం తమైన నినాదంతో మూడో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదుకు జనసేనాని శ్రీకారం చుట్టారు.కేవలం ఆంధ్రప్రదేశ్ కే పరిమితం కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పాటు మహారాష్ట్ర లోనూ తన ఉనికిని చాటుకోవాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించడం రాజకీ య వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాబోయే పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి భారీ స్థాయిలో సభ్యులను చేర్చుకోవడం ద్వారా కేడర్ బలాన్ని ప్రదర్శించాలని అధినేత పవన్ కల్యాణ్ స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు .ఈసారి క్రియాశీలక సభ్యత్వ రుసుమును రూ. 500 నుండి రూ. 400కు తగ్గించి సామాన్యులకు మరింత చేరువయ్యే ప్రయత్నాన్ని జనసేన చేస్తోంది

# ఎలివేటెడ్ కారిడార్ కు రాజిరెడ్డి పేరు పెట్టడంపై.... మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆగ్రహం



**ఉప్పల్, మార్చి 30, (తెలంగాణ దిశ)** :కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మాణంలో ఉన్న ఉప్పల్ నుంచి నారపల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్ పనులపై మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉ న్న సమయంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ ప్రాజెక్టు పురోగతిలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, అలసత్వం, అలాగే జిహెచ్ఎంసి సహకారం లేకపోవడం ప్రధాన కారణాలని ఆయన విమర్శించారు. అప్పటి బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరితో పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. పనులు వేగవంతం చేయడానికి తాను పలు మార్లు సమీక్షలు నిర్వహించి లక్ష్యాలు నిర్దేశించామని పేర్కొన్నారు.ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధం లేని వ్యక్తుల పేర్లు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్ర నిధులతో చేపట్టిన ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వానికి పేర్లు పెట్టే అధికారం లేదని హెచ్చరించారు. దీనికి సంబంధించిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా, ఉప్పల్––నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌కు భారత మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్ పాయ్ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కోరారు.

# అమరావతి రైల్వే లైన్ కు నిధులు

## 2047 కోట్లు.. 57కిమీ దూరం..!

**విజయవాడ,తెలంగాణ దిశ** : రైల్వే డిపార్ట్మెంట్, ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోన్న అమరావతి రైల్వే లైన్ కోసం తెలంగాణ రైతుల నుంచి భూసమీకరణ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ –తెలంగాణ బోర్డర్‌లోని ఎర్రుపాలెం గ్రామం పరిధిలోని రైతులు అమరావతి రైల్వే లైన్ కోసం భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఇప్పటికే దీనికోసం రైల్వే అధికారులు ఎర్రుపాలెం గ్రామస్తులతో పలు దఫాలు చర్చలు జరుపగా దాదాపు అందరూ ఒప్పుకొన్నట్టు అక్కడి స్థానికుడు, అడ్వకేట్ శ్రీనివాస్ తెలిపారు. నిజానికి ఈ ప్రాజెక్ట్‌లో సంక్లిష్టమైన భాగం ఈ భూ సేకరణ అని రైల్వే భావించింది. ఆంధ్రప్రదేశ్‌లో రైతుల నుంచి ఏపీ ప్రభుత్వం ఆల్రెడీ సేకరికంచిన భూమి ఉంది. కానీ తెలంగాణలోని ఎర్రుపాలెంలో భూములు అమరావతి రైల్వే లైన్ కోసం ఇస్తారా అని అందరూ అనుమానించారు కానీ తెలంగాణ రైతులు మాత్రం దానికి దాదాపు అంగీకరించడంతో ఈ కొత్త రైల్వే లైన్‌కి అడుగు ముందుకు పడినట్టు అయింది.ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం గ్రామానికి శాతాబ్దాల చరిత్ర ఉంది. ఇక్కడికి సమీపంలో ఉన్న జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయం చాలా పురాతనమైంది. ఇక్కడికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అయినప్పటికీ ఎర్రుపాలెం రైల్వే స్టేషన్‌లో పెద్దగా రైళు ఆగవు. విజయవాడ –భద్రాచలం రోడ్డు మెము, విజయవాడ –డోర్నకల్ ప్యాసింజర్, గోల్కొండ ఎక్స్ ప్రెస్, కృష్ణా ఎక్స్ ప్రెస్ మాత్రమే ఇక్కడ రోజూ ఆగుతాయి. ఈ నాలుగు కాకుండా వారానికి రెండుసార్లు ప్రయాణించే చెన్నై –లక్నో ఎక్స్ ప్రెస్‌కి ఈ స్టేషన్‌లో హాల్ట్ ఉంది. చాలా రోజులుగా ఎర్రుపాలెం సహా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పద్మావతి, శాతవాహన, విజయవాడ –సికింద్రాబాద్ ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్‌లను ఎర్రుపాలెం స్టేషన్‌లో ఆపాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ అది ఒక డిమాండ్ గానే ఉండిపోతూ వచ్చింది. అమరావతి బైపాస్ రైల్వే లైన్ ఈ స్టేషన్ నుంచే ప్రారంభం అవుతుందని రైల్వే ప్రకటించడంతో ఎర్రుపాలెం వాసుల మైండ్‌లో కొత్త ఆశలు చిగురించాయి. ఈ లైన్ వల్ల ఎర్రుపాలెం స్టేషన్ హోదా మారి జంక్షన్ అవుతుంది. దానివల్ల అమరావతి వైపు వెళ్లే కొత్త రైళ్ళతోపాటు ఆల్రెడీ ఉన్న కొన్ని అదనపు రైళ్ళకు కూడా ఈ స్టేషన్‌లో హాల్టింగ్ ఇచ్చి తీరాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ఊరు కూడా డెవలప్ అవుతోందని ఇక్కడి రైతులు భావిస్తున్నట్టు రెడ్డి అనే మరో గ్రామస్తుడు తెలిపారు. మొదట కాస్త ఇబ్బందిగా ఫీల్ అయినా మూడు నాలుగు దఫాల మీటింగ్స్ తర్వాత తమ భూములు కొత్త రైల్వే లైన్ కోసం ఇవ్వడానికి ఇక్కడి రైతులు ఒప్పుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న భూములు మార్కెట్ ధరలకు మూడు రెట్లు పరిహారం లభించనున్నట్టు కొందరు గ్రామస్తులు తెలిపారు. భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తమ భూ ములను ఇవ్వడానికి వీరు ఒప్పుకొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్‌లో కూడా భూసేకరణ జరగాల్సి ఉన్నా అది పెద్దగా సంక్లిష్టం కాదు. ఆల్రెడీ అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన భూమి ఉంది.





# మరోమారు భగ్గుమన్న పుత్తడి ధరలు

**పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యుల బెంబేలు**

న్యూఢిల్లీ, : దేశంలో బంగారం, వెండి ధరలు సామాన్యుల అంచనాలకు అందని విధంగా మారుతున్నాయి. రెండు రోజుల పాటు దాదాపు స్థిరంగా కొనసాగిన ధరలు శనివారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దేశంలో బంగారం ధర సగటున రూ. 3 వేల మేర పెరగ్గా వెండి ధర కూడా చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఎగబాకింది.
అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యులకు ధరలు కంగారు పెట్టిస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ. 1,64,730లకు చేరుకుంది. నిన్నటి ముగింపు ధరతో పోలిస్తే ఏకంగా రూ. 3,160ల మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ పసిడి ధర కూడా రూ. 2,900ల మేర పెరిగి రూ. 1,51,000లకు చేరుకుంది. నగరంలో వెండి ధర కూడా రూ. 5 వేల మేర పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి రూ. 3 లక్షలుగా ఉంది.
చెన్నైలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర గరిష్ఠంగా రూ. 1,65,820కు చేరింది. ముంబై, కర్ణాటక, బెంగళూరు నగరాల్లో మేలిమి బంగారం ధర రూ. 1,64,730గా ఉంది. ఢిల్లీలో రూ. 1,64, 880ల వద్ద కొనసాగుతోంది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర (10 గ్రాములు) చెన్నైలో రూ. 1,52,000గా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ. 1,51,000 వద్ద కొనసాగుతోంది.

# అమ్మవారా? వ్యాధా?



ప్రపంచంలో ప్రతి సంస్కృతి, నాగరికత మనిషికి సంక్రమించే వ్యాధులకు ఏదో రకమైన మూఢనమ్మకాలను ఆపాదిస్తూ ఉంటుంది. పూర్వకాలంలో ఈ వ్యాధుల గురించి శాస్త్రీయ అవగాహన లేనప్పుడు, వ్యాధులు దేవతల యొక్క కోప, ప్రకోపాలని భావించే వాళ్ళు. ఆ దేవతలను ప్రసన్నం చేసుకుంటే వ్యాధి తగ్గుతుందని భావించి అందుకోసం బలులిచ్చి, పూజలు, జాతరలు చేసేవాళ్లు (ఇప్పటికీ జాతరలు చాలా చోట్ల జరుగుతూనే ఉన్నాయి). తరం నుండి మరో తరానికి వారసత్వంగా వచ్చేసరికి నమ్మకాలు ప్రబలి కొండొకచో మూఢ నమ్మకాలుగా తయారవుతాయి. ఈ నమ్మకాలు ప్రజలలో ఒక భాగం అవుతాయి. మన భారతదేశంలో విస్తారమైన నమ్మక వ్యవస్థ నిర్మించబడి ఉంది. రకరకాల వ్యాధుల గురించి రకరకాల నమ్మకాలు ఉన్నాయి. అలాంటి నమ్మకాలలో ఇప్పటికి కూడా ప్రబలంగా, సజీవంగా ఉన్న వ్యాధి చికెన్ పాక్స్ (అమ్మవారు).

ఈ చికెన్ పాక్స్ వ్యాధిని 'అమ్మ పోయడం, అమ్మోరు పోయడం, అమ్మ తల్లి వచ్చింది, అమ్మోరు, ఆటలమ్మ, చిన్నమ్మ వారు, శీతాలమ్మ, మాత' ఇలా రకరకాల పేర్లతో అనేక ప్రాంతాలలో అమ్మవారి ప్రభావంగా భావిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక మూఢనమ్మకాలతో ఈ చికెన్ పాక్స్ ముడిపడి ఉంది. కానీ ప్రపంచంలో ఎక్కడా లేనన్ని అపోహలు మన దేశంలో ఈ చికెన్ పాక్స్ చుట్టూ అల్లుకొని ఉన్నాయి. మారెమ్మ, గంగమ్మలతో ముడివడి చికెన్ పాక్స్ ఆ మాతకు, తల్లికి వచ్చిన కోపంగా భావిస్తారు ('అమ్మోరు' సినిమాలో మీరు చూసే ఉంటారు). ప్రకృతిని ఆరాధించడం సర్వసాధారణం. కానీ ప్రతి సమస్యని, అనారోగ్యాన్ని కూడా నమ్మిన దేవతలతో ముడిపెట్టి చూడడం సాధారణమైపోయింది. ఈ వ్యాధి వైరస్ అనే విషయం చదువుకున్న వారికి తెలిసినా చాలామంది పసుపు నీళ్లు, పత్యాలు అని పాటిస్తూ ఉంటారు (పుస్తకాల్లో, పాఠాల్లో అది వైరస్. ఇంట్లో అయితే అమ్మవారు అది సంగతి, అదీ భయం). పల్లెల్లో అమ్మవారికి కోడిని బలి ఇవ్వడం, వ్యాధి సోకిన పిల్లలకైతే తల్లిపాలు ఇవ్వకపోవడం, పోత పాలు పట్టడం, చెవుల్లో ముక్కుల్లో నూనె చుక్కలు వేయడం, తీర్థాలు పసుపు నీళ్లు పట్టడం, వేపాకు ముద్దలు తినిపించడం లాంటివి చేస్తూ ఉంటారు.

పూజలు, బలులు, ఉపవాసాలు, జాగారాలు, దిష్టి తీయడం ఈ తతంగంలో భాగమే. చికెన్ పాక్స్ వచ్చినప్పుడు దద్దుర్లు దురద పెడుతూ ఉంటుంది. రోగిని పచ్చి వేపాకుపై పడుకోబెడితే దురద ఇంకా ఎక్కువవుతుంది. వ్యాధి సోకిన వారికి అమ్మవారి పేరుతో రోజుల తరబడి స్నానం చేయకపోతే నీటి బుడ్డలలో బ్యాక్టీరియా చేరి మరింత ప్రమాదంగా మారుతుంది. చికెన్ పాక్స్‌ని ఆటలమ్మవారు, చిన్నమ్మవారు అంటారు కదా, ఆటలాడుతే పోతుందిలే అనుకుంటారు. మూఢనమ్మకాలతో వైద్యం చేయించకపోతే ఇతర సమస్యలు వస్తాయి. కొన్నిసార్లు బిడ్డ మరణించే ప్రమాదం కూడా ఉంది. చికెన్ పాక్స్ సాధారణంగా పిల్లల్లో కంటే పెద్దవాళ్లలో తీవ్రంగా ఉంటుంది. ఓ మోస్తరుగా పసుపు యాంటిసెప్టిక్‌గా ఉపయోగపడుతుంది. కానీ దురద నుండి ఉపశమనం ఇవ్వదు.

ఈ వ్యాధి సోకినప్పుడు శరీరం,
చర్మం, పక్క బట్టలను శుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరానికి, దురదకు వైద్యులు సూచించిన మందులను వాడాలి. పిల్లల గోళ్లు కత్తిరించి, పలుచని బట్టలు చేతికి చుడితే వాళ్ళు గోకేసుకోకుండా ఉంటారు. తేలికగా అరిగే బలవర్ధకమైన ఆహారం వ్యాధి సోకిన వారికి ఇవ్వాలి. అంతేగాని ఉపవాసం ఉండకూడదు.

శాస్త్రం ఏం చెప్తుంది అంటే ఈ చికెన్ పాక్స్ 'వరిసెల్లో జోస్టర్ వైరస్' వల్ల కలిగే అంటువ్యాధి. ఈ వ్యాధి సోకినప్పుడు చిన్న దురద బొబ్బలను ఏర్పరిచే చర్మపు దద్దుర్లు ఏర్పడతాయి. అవి చర్మాన్ని కప్పివేస్తాయి. ఛాతీ, వీపు, ముఖంపై ప్రారంభమవుతుంది. తర్వాత శరీరంలోని మిగిలిన భాగాలకు వ్యాపిస్తుంది. దద్దుర్లతో పాటు జ్వరం, అలసట, తలనొప్పి వంటి ఇతర లక్షణాలు ఉంటాయి. ఐదు రోజుల నుంచి ఈ ఏడు రోజులు వరకు దీని ప్రభావం ఉంటుంది.

ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తి నోటి నుండి వెలువడే తుంపర్ల ద్వారా, శరీరంపై ఉన్న నీటి పొక్కుల స్రావాల ద్వారా పక్క నున్న వారికి ఈ వైరస్ వ్యాపిస్తుంది.ఎండిపోయి చెక్కు కట్టిన చర్మం వల్ల హాని లేదు. ఇలాగా ఈ అంటి వ్యాధి పట్ల జాగ్రత్త వహించి సరైన చికిత్స చేయించాలి. అభివృద్ధి చెందిన దేశాల లో చికెన్ పాక్స్‌కి వ్యాక్సిన్లు 1990లో వాడకంలోకి వచ్చింది. గత పదేళ్లుగా మనం దేశంలో కూడా వారిసెల్లో వ్యాక్సిన్ వాడుకలోకి వచ్చింది. ప్రభుత్వాలు ఉచిత టీకాల జాబితాలో దీనిని చేర్చకపోయినా విరివిగా అందుబాటులో ఉంది.

ఈ అమ్మవార్ల గురించి మరొక విషయం మీకు చెప్పాలి. నా చిన్నప్పుడు అంటే దాదాపు 1976 ప్రాంతంలో మా ఊర్లో గోడల పైన స్టెన్సిల్ కటింగ్ రేకు ఫ్రేములపై నీలిమందు రంగు పూసి ఓ ప్రకటనను గోడలపై రాశారు. పూర్తి ప్రకటన గుర్తు లేకపోయినా విషయం గుర్తుంది. అదేమిటంటే "పెద్దమ్మ వారు.. మసూచి ఆనవాళు తెలిపిన వారికి వెయ్యి రూపాయల బహుమతి" అని. అదేదో ఆనవాళ్లు కనిపెట్టేసి, చెప్పేసి ఆ బహుమతి ఏదో నాకే వస్తే బాగుండునని ఆశ నాకు కలిగింది. కొన్నాళ్ళకి ఆ బహుమతిని పది వేల రూపాయలు దాకా పెంచారు (ఎంత పొగరు వీళ్లకు?! అనుకున్నా. అది పొగరు కాదని, సైన్స్ ఇచ్చిన భరోసా అని తర్వాత అవగాహన కలిగింది). అప్పట్లో "ఆ పెద్దమ్మ వారు ఎవరో, మాకు ఎవరికి కనిపించకుండా ఎక్కడ దాక్కున్నారో?? 'ఏదో నాకు గాని నా స్నేహితులకు గాని ఆ మాటకొస్తే మా ఊరిలో ఎవరికీ దొరకలేదు. బహుమతి కూడా అందలేదు. అది వేరే సంగతి అనుకోండి.

తర్వాత తర్వాత తెలిసింది. పెద్ద అమ్మవారు అంటే అతి భయంకరమైన అంటు వ్యాధి అయిన "మసూచి" అని (పెద్దమ్మవారు, స్ఫోటకం, స్మాల్ పాక్స్ అని కూడా అంటారు). ఆ "పెద్ద అమ్మవారిని" ఈ భూమండలం నుండి తొలగించారని, నిర్మూలించారని, ఇకపై ఆ వ్యాధి ఎవరిని బాధించదని తెలిసింది.

దాదాపు మూడు వేల సంవత్సరాలుగా ప్రపంచాన్ని గడగడలాడించి, కోట్ల మందిని పొట్టను పెట్టుకున్న "మసూచి" (స్మాల్ పాక్స్) అంటువ్యాధి నిరోధించడానికి డాక్టర్ ఎడ్వర్డ్ జెన్నర్ 1796లో వ్యాక్సిన్‌ను కనుగొన్నారు. ఆ వ్యాక్సిన్ గురించి పూర్తిగా ప్రజలకు అర్థమై, అవగాహన చేసుకొని, నమ్మకం పెంచుకొని, వ్యాక్సిన్ అందుబాటులో వచ్చి, అందరూ వ్యాక్సిన్ తీసుకొని ఆ వ్యాధిని పూర్తిగా తొలగించడానికి దాదాపు 200 ఏళ్లు పట్టింది. అంటే ప్రపంచ వ్యాప్తంగా ప్రజలందరూ వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత 1980లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఒ) భూమిపై మసూచి వ్యాధి పూర్తిగా తొలగి పోయిందని ప్రకటించింది. అంటే ఇకపై భూమిపై ఎవరికి మసూచి వచ్చే అవకాశం లేదన్నమాట.

ఇలాగే రానున్న కాలంలో చికెన్ పాక్స్‌ను కూడా ఈ భూమిపై నుండి పంపించవచ్చు. కాబట్టి ఇవన్నీ వ్యాధులే తప్ప అమ్మవారి కోపతాపాలు, ఆటలు కాదని ప్రజలు గ్రహించాలి.మతాధిపతులైనా, పీఠాధిపతులైనా, బాబాలైనాజబ్బువస్తే డాక్టర్ని సంప్రదించాలి తప్ప మంత్రాలు, తాయెత్తులు,పూజలతో, పవిత్ర జలాలతో, ప్రార్థనలతో, యజ్ఞ యాగాదులతో ఎవరూ నయం చేయలేరని చరిత్ర నిరూపించింది. 'కరోనా' దాన్ని మరొకసారి బల్లగుద్ది ప్రపంచానికి చాటి చెప్పింది.

# 'తులసి'తో జ్ఞాపకశక్తి మెరుగు

**జీవన క్రియల పెంపు**

**ఒత్తిడి తగ్గించడంతోపాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది**

**గుండెపోటు రిస్క్ తగ్గుదల**

**'అమెరికా నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్' వెల్లడి**




**భారతీయులు పవిత్రంగా భావించే 'తులసి' ఇప్పటికే మన దేశం లో ఆయుర్వేద ఔషధాల్లో ప్రసిద్ధి చెందింది. అయితే, మనుషుల సంపూర్ణ ఆరోగ్యానికి 'తులసి' దోహదపడుతున్నదని 'అమెరికా నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్' తన పరిశోధనలో తేల్చింది. తులసి జ్ఞాపకశక్తిని మెరుగుపర్చడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తున్నట్టు తాజాగా వెల్లడించింది. దీంతో తులసి మొక్క ప్రాముఖ్యత గ్లోబల్ స్థాయికి చేరినట్లయింది.**

తులసి వివిధ రకాల ఒత్తిళ్లను తగ్గించడంతో పాటు రద్దీ ప్రదేశాల్లో నివాసం ఉండేవారిని కాలుష్యం నుంచి కాపాడుతున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. పనిచేయడం వల్ల కలిగే శ్రమ, చలి, పెద్ద శబ్దాల నుంచి ఉపశమనం కలిగించడంతో పాటు శరీర సమతుల్యతకు తోడ్పాటు అందిస్తున్నట్టు పేర్కొంది. బీపీ, రక్తంలో చక్కెరలు, కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను తగ్గిస్తున్నట్టు పరిశోధనలో తేలింది. డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి మంచి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతున్నదని తెలిపింది. రక్తంలో గ్లూకోజ్‌ను తగ్గించడంతో పాటు లిపిడ్ ప్రొఫైల్‌ను మెరుగుపర్చడం, మానవ శరీరంలోని జీవన క్రియలను పెంపొందిస్తున్నట్టు ఆ నివేదిక వెల్లడించింది. తులసితో మరిన్ని ప్రయోజనాలు ఇలా..: యాంటీ బ్యాక్టరీయా గుణాలు ఉన్న తులసి అనేక రకాల వైరస్‌లతో పోరాడుతున్నదని, జలుబును నివారించడంతోపాటు హ్యాండ్ శానిటైజర్, మౌత్ వాష్‌గా పనిచేస్తున్నట్టు ఆ పరిశోధనలో వెల్లడైంది. యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాల కారణంగా రోగాల బారిన పడకుండా కాపాడుతున్నదని నివేదిక పేర్కొంది. మనిషి సానుకూల దృక్పథంతో ఉండేందుకు, ఆందోళన, డిప్రెషన్‌కు గురికాకుండా పనిచేస్తున్నట్టు తెలిపింది. మనిషిలో ఒత్తిడిని తగ్గించేందుకు మెదడులోని రసాయనాలైన డొపమైన్, సెరొటొనిన్‌ను బ్యాలెన్స్ చేస్తున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. మన దైనందిన జీవనంలో రేడియషన్ల వల్ల కలిగే నష్టం నుంచి మన శరీరాన్ని రక్షించడంలో తులసి సహాయపడుతుందని, హాని కలిగించే పదార్థాల నుంచి కాపాడటంలో భాగంగా కాలేయ ఎంజైమ్‌ల ఉత్పత్తికి తోడ్పాటునందిస్తున్నట్టు నివేదిక వెల్లడించింది. ఈ చర్యతో మన శరీరంలో డీఎన్ఏకు కలిగే నష్టాన్ని తగ్గించి జీవకణాల ఆరోగ్యానికి బాసటగా నిలుస్తున్నట్టు స్పష్టం చేసింది. తులసిలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామెటరీ, యాంటీయాక్సిడెంట్ల కారణంగా గాయాలను త్వరగా తగ్గిస్తుందని పేర్కొంది. అల్సర్ నిరోధక ప్రభావాలు కలిగి ఉండటం, జీర్ణక్రియ సమస్యలు, కడుపునొప్పి, వాంతులు, విరేచనాల నుంచి ఉపశమనం కలిగిస్తున్నట్టు తెలిపింది. రక్తంలోని లిపిడ్‌ను తగ్గించడం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడటంతో పాటు గుండెపోటు రిస్క్‌ను తగ్గిస్తుందని 'అమెరికా నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్' తన పరిశోధనలో వివరించింది.

# బొద్దింకలు వ్యాధుల కారకాలు

బొద్దింకల్ని చూడగానే చిరాకు పుడుతుంది. ఈ విషయం అలా ఉంచితే బొద్దింకలు ఎన్నో వ్యాధులకు కారణమవుతాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నారులు, వృద్ధులు బొద్దింకల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వీటి ద్వారా వ్యాపించే కొన్ని ముఖ్యమైన వ్యాధుల గురించి తెలుసుకుని ఉండాలి.ఫుడ్ పాయిజనింగ్: అపరిశుభ్ర వాతావరణంలో తిరిగే బొద్దింకలు తాకితే మనం తాగేనీళ్ల, తినే ఆహారం కలుషితమవుతాయి. దీంతో ఫుడ్ పాయిజనింగ్ జరుగుతుంది. దీనివల్ల కడుపునొప్పి, వాంతులు, డయేరియా (అతిసారం), జ్వరం లాంటి సమస్యలు తలెత్తుతాయి. వీటిని ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్ (ఓఆర్ఎస్)తో తగ్గించుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో యాంటిబయాటిక్స్ అవసరమూ ఉంటుంది.టైఫాయిడ్: బొద్దింకల నుంచి వచ్చే వ్యాధుల్లో తీవ్రమైనది టైఫాయిడ్. ఇది సాల్మొనెల్లా టైఫి అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుంది. కలుషిత జలం తాగినప్పుడు, కలుషిత ఆహారం తిన్నప్పుడు ఈ క్రిమి మన శరీరాల్లో చేరిపోతుంది. తీవ్రమైన జ్వరం, బలహీనత, తలనొప్పి, కొన్నిసార్లు మలబద్ధకం, ఇంకొన్నిసార్లు డయేరియా (అతిసారం).. ఇవి టైఫాయిడ్ లక్షణాలు. క్రిమి సోకిన 12 నుంచి 72 గంటల్లో టైఫాయిడ్ లక్షణాలు కనిపిస్తాయి. తగినంత విశ్రాంతి, యాంటిబయాటిక్స్‌తో దీన్నుంచి విముక్తి



పొందొచ్చు.కలరా: బొద్దింకల నుంచి వ్యాపించే మరో వ్యాధి కలరా. అపరిశుభ్రమైన పరిసరాల కారణంగా కలరా సోకుతుంది. అతిసారం, నీళ్ల విరేచనాలు, వాంతులు మొదలైనవి దీని లక్షణాలు. డీహైడ్రేషన్ సమస్య ఉంటే ఐవీ ఫ్లూయిడ్స్, యాంటిబయాటిక్స్ అవసరమవుతాయి. పరిశుభ్రతే ప్రధానం: బొద్దింకల మూలంగా వ్యాధులు రాకూడదనుకుంటే ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఆహారంపై మూతలు పెట్టాలి. చెత్తబుట్టలను క్రమం తప్పకుండా కడిగి శుభ్రం చేస్తూ ఉండాలి. అవసరాన్ని బట్టి పెస్ట్ కంట్రోల్ చేయిస్తూ ఉండాలి. చికిత్స కంటే వ్యాధి రాకుండా నివారించుకోవడం ఉత్తమం. అనుకోకుండా బొద్దింకల వల్ల ఫుడ్ పాయిజనింగ్ లాంటి సమస్యలు, ఇతర లక్షణాలు కనిపిస్తే సత్వరమే వైద్య సహాయం పొందాలి.



# ఆవాలలో దాగి ఉన్న ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు..!

ఆవాల గురించి అందరికీ తెలిసిందే. వీటిని మనం ఎంతో కాలం నుంచే వంట ఇంటి పోపు దినుసులుగా ఉపయోగిస్తున్నాం. ఆవ పిండిని ఊరగాయల తయారీలో ఉపయోగిస్తారు. అయితే ఆవాలను కేవలం వంటల్లో ఇలా ఉపయోగిస్తారు కానీ అవి అందించే ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం ఎన్నో ఉన్నాయి. ఆవాల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఆవాల్లో మెగ్నిషియం, క్యాల్సియం, మాంగనీస్, జింక్, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, ఫైబర్ ఉంటాయి.

ఆవాలు ఘాటైన వాసనను కలిగి ఉంటాయి. వీటిని ఆయుర్వేదంలో పలు ఔషధాల తయారీలో ఉపయోగిస్తారు. ఆరోగ్య పరంగా ఆవాలు మనకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తాయి. ఆవాలలో ఫైటో న్యూట్రియెంట్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ప్రతి 100 గ్రాముల ఆవాల్లో సుమారుగా 9.82 మిల్లీ గ్రాముల టోకోఫినా ల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది విటమిన్ ఇ లా పనిచేస్తుంది.

**గుండె ఆరోగ్యంగా..:** ఆవాలలో ఉండే టోకోఫినాల్ వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. కనుకనే ఆవనూనెను వంటల్లో ఉపయోగించాలని ఆయుర్వేద వైద్యులు చెబుతుంటారు, ఇది గుండెకు సంరక్షణను అందిస్తుంది. గుండె పోటు రాకుండా చూస్తుంది. ఆవాల్లో సెలీనియం అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఊపిరితిత్తుల సమస్యలను, వాపులను తగ్గిస్తుంది. పోపు దినుసులుగా ఆవాలను ఉపయోగిస్తే అవి ఆకలిని పెంచుతాయి. ఆహారం సరిగ్గా జీర్ణం అయ్యేట్లు చేస్తాయి. గొంతు నొప్పి, దగ్గు, జ్వరం వంటి సమస్యలు ఉన్నప్పుడు మరుగుతున్న నీళ్లలో చిటికెడు ఆవాల పొడి, తగినంత తేనె వేసి ఇస్తే సమస్యలు నియంత్రణలో ఉంటాయి. ఆవాల్లో క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడే గుణాలు ఉంటాయి.

**పాదాల నొప్పులకు..:** ఆవాల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్త ప్రసరణను మెరుగు పరుస్తాయి. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఆవాలను దంచి వాపు ఉన్న ప్రదేశంలో వేసి కట్టులా కడుతుంటే నొప్పులు, వాపులు తగ్గుతాయి.

ముఖ్యంగా గౌట్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. అర బకెట్ వేడి నీటిలో ఒక టీస్పూన్ ఆవాల పొడి వేసి కాళ్లను కొద్ది సేపు అందులో ఉంచాలి. దీంతో పాదాల నొప్పులు తగ్గుతాయి. తెల్ల ఆవనూనె చర్మ రంగును మెరుగు పరుస్తుంది. దీన్ని శరీరానికి బాగా పట్టించి మర్దనా చేయాలి. కాసేపు అయ్యాక స్నానం చేయాలి. తరచూ ఇలా చేస్తుంటే చర్మం మంచి రంగును పొందుతుంది. చర్మానికి సహజసిద్ధమైన నిగారింపు వస్తుంది. చర్మం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తుంది.

**సమృద్ధిగా పోషకాలు..:** కొబ్బరినూనెలో ఆవనూనెను కలిపి శిరోజాలకు రాస్తుండాలి. దీంతో అన్ని రకాల జుట్టు సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. జుట్టు రాలడం తగ్గుతుంది. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా మారుతాయి.

ఆరోగ్యంగా ఉంటాయి. జుట్టు చిట్లడం తగ్గుతుంది. చుండ్రు నుంచి బయట పడవచ్చు.

100 గ్రాముల ఆవాలలో తేమ 6.5 గ్రాములు, పొటాషియం 20.3 మిల్లీగ్రాములు, కొవ్వులు 39.7 గ్రాములు, ఫైబర్ 4.8 గ్రాములు. పిండి పదార్థాలు 23.8 గ్రాములు, క్యాల్షియ 490 మిల్లీగ్రాములు, ఫాస్ఫరస్ 700 మిల్లీగ్రాములు, ఐరన్ 7.9 మిల్లీగ్రాములు, టోకోఫినాల్ 9.82 మిల్లీగ్రాములు ఉంటుంది. 100 గ్రాముల ఆవాలతో మనకు సుమారుగా 540 క్యాలరీల శక్తి లభిస్తుంది. ఆవాల ద్వారా మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలిగే మాట వాస్తవమే అయినప్పటికీ వేడి శరీరం ఉన్నవారు వీటిని తీసుకోరాదు. ఆవాలను చాలా తక్కువ మోతాదులో వాడుకుంటే ఎక్కువ ఫలితం పొందవచ్చు.

# మంచి ఆలోచనలే శ్రీరామరక్ష..

చెడు వ్యసనాలు వదిలి నిర్మల మనస్సుతో ఉన్నంత కాలం మనలను ఏ మలినం ఆవరించదు. ఓ రకంగా నిర్మలమైన మనస్సు ఆరోగ్యానికి హేతువు.మన మనస్సు చేసే మంచి ఆలోచనలతోనే మన దేహం కూడా అదుపులో ఉంటుంది. ఆరోగ్యంగా ఉంటుంది. చెడు ఆలోచనలను మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. ఇకపోతే ఇది సత్యం. సత్యం కఠినంగానే ఉంటుంది. మనిషి సత్యవచస్సులోని ఆంతర్యాన్ని తెలుసుకొని ఆచరిస్తే, ఆ కఠినవచస్సు అమృతమయం అవుతుంది. అనేక వ్యసనాలకు మనిషి బానిస అవుతాడు. అలాంటివాడికి వ్యసనాలను మానుకొమ్మని చెప్పే మాటలు రుచించవు. నిప్పుల్లోకి దూకే మిడతకు ఆ నిప్పు కాల్చివేస్తుందనే సత్యం తెలియదు. అలాగే వ్యసనాలకు లోనైన మనిషికి వాటి పర్యవసానం ఎలా ఉంటుందో తెలియదు. వ్యసనపరుడికి తాత్కాలికంగా లభించే ఆనందం, సుఖమే నచ్చుతాయి. అందుకే వ్యసనపరులు వ్యసనపరులతోనే సహవాసం చేస్తారు. మంచివాళ్లు చెప్పే మాటలు వారి చెవులకు శూలాల్లా గుచ్చుకొంటాయి. గాడిదకు గంధం వాసన తెలియనట్లు, పందికి పరమాన్నపు రుచి తెలియనట్లే- వ్యసనపరుడికి హితవచన మహిమ తెలియదు. మనిషి బాగుపడాలం టే పెద్దలపట్ల భయమైనా ఉండాలి, లేదా మంచి విషయాలపై భక్తి అయినా ఉండాలి. భయం కాని, భక్తి కాని లేని మనిషి తెగిన గాలిపటంలా ఎక్కడ పతనమవుతాడో ఎవరికీ తెలియదు. చేతులు కాలాక ఆకులు పట్టుకొన్న చందంగా, మనిషి అధోగతిపాలైన తరవాత జ్ఞానోదయమైనా- చేయగలిగిందేమీ ఉండదు. మనిషికి భాగ్యదాయక క్షణాలు ఎప్పుడో కానీ రావు. అలా వచ్చినవాటిని చక్కగా ఉపయోగించుకొనేవాడికి జీవితం ఆనంద బృందావనం అవుతుంది. ఎవరో రావాలని, ఏదో చేయాలని భ్రమలో మునిగిపోతూ కర్తవ్యాన్ని మరచే మనిషిని దేవుడు కూడా బాగుపరచలేడు.

# పరిశుభ్రత, సమతుల ఆహారమే కీలకం



ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) నివేదిక ప్రకారం అంటువ్యాధుల కారణంగా 71 శాతం మంది మృత్యువాత పడుతున్నారు. మనదేశంలో 63 శాతం మంది చనిపోతున్నారు. అంటువ్యాధుల కారకాలను ముందస్తుగా గుర్తించటం, వ్యాధుల ముప్పును ముందుగానే అంచనా వేయటం, విస్తృత వేగంతో వాటిని ఎదుర్కొనే చర్యలపై పలు ప్రపంచవ్యాప్త ఆరోగ్య సంస్థలు పరిశోధనలు కొనసాగిస్తూనే ఉన్నాయి.

మన శరీరంలో అంతర్లీనంగా అద్భుతమైన రోగనిరోధక వ్యవస్థ ఉంటుంది. సూక్ష్మజీవులు, వ్యాధికారకాల నుంచి ఆరోగ్యాన్ని నిరంతరం కాపాడే కవచమిదే. కణాలు, వివిధ అవయవాలు, ప్రతిరక్షకాలతో కూడిన ఈ వ్యవస్థ శరీరంలోకి ప్రవేశించే హానికరమైన వాటిని గుర్తించి ఎదుర్కొంటుంది. శరీర కణజాలం నుంచి అనవసరమైన పదార్థాలను వేరుచేసి వ్యాధుల నుంచి రక్షిస్తుంది. పుట్టుకతో వచ్చే రోగనిరోధక వ్యవస్థకు తోడు మనిషి పెరిగేకొద్దీ నిర్దిష్ట వ్యాధి కారకాలను ఎదుర్కోవడానికి టీకాలు అవసరమవుతాయి. సకాలంలో వీటిని తీసుకోకపోతే పలు అంటురోగాలు, ప్రాణాంతక వ్యాధులు, జన్యుపరమైన రుగ్మతలు వంటివి ఉధృతమవుతుంటాయి.

కరోనా పరిణామాల తర్వాత ఏటేటా ప్రపంచవ్యాప్తంగా వివిధ అంటువ్యాధులు (ఇన్ఫెక్షన్ డిసీజెస్) ప్రబలుతూ ప్రజలను భయానికి గురి చేస్తున్నాయి. పలు రకాల వైరస్‌లు విస్తరిస్తూ భయోత్పాతానికి గురిచేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) కొత్త వైరస్‌ల తాలూకా వివరాలను వెల్లడిస్తూ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయమై కూడా హెచ్చరికలు సైతం జారీచేస్తోంది. ప్రపంచంలోని పలు సంస్థల నుంచి వచ్చిన పరిశోధనా ఫలితాలు, నియంత్రణకు తీసుకోవాల్సిన కృషి గురించి వివరిస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పలు రకాల వైరస్‌లు విజృంభిస్తుండగా, మిలియన్ల వైరస్‌లు మామూలుగానే ఉన్నట్లుగా సమాచారం. జంతువులు, పక్షులకు వ్యాపించే ఇలాంటి వైరస్‌లు ఎప్పుడైనా మానవాళిపై ప్రభావాన్ని చూపించొచ్చు. ఇప్పటికే ఎబోలా, జికా వైరస్, డింగా డింగా జబ్బు, స్క్రబ్‌టైఫస్ వంటివి ఇప్పటికే ఉన్నాయి.

అంటువ్యాధులు–అప్రమత్తం: ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అంటువ్యాధుల్లో సూక్ష్మక్రిములు (బ్యాక్టీరియా), వైరస్, ఫంగస్, పరాన్న జీవికి సంబంధించినవి. అంటువ్యాధి కాకుండా మిగిలిన జబ్బులైన వాటిలో జీవన శైలికి సంబంధించినవి షుగర్, గుండె జబ్బులు, బిపి వంటివి. మానసిక వ్యాధుల్లో డిప్రెషన్, యాంగ్జైటీ, వాతావరణంతో వచ్చే జబ్బుల్లో ఫుడ్ పాయిజన్, కలుషిత నీటి వ్యాధులు, ఆహార లోపంతో వచ్చే జబ్బులు (న్యూట్రీషనల్ డిసీజెస్)లో ఊబకాయం, విటమిన్ లోపంతో వచ్చేవి ఉన్నాయి. వీటిలో ఎక్కువ మానవ నిర్లక్ష్యం తో వచ్చేవే ఎక్కువ. ముందస్తుగా జీవనశైలికి సంబంధించిన మార్పు లు, జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా కొన్ని ఎపిడమిక్స్ (అంటువ్యాధుం లు) నుంచి బయటపడొచ్చు. ఎండమిక్స్ (ప్రదేశం వాతావరణం), పాండమిక్ (మహమ్మారి)గా చెప్పుకునే వ్యాధులతో జాగ్రత్తలు తీసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు సమన్వయంతో అంటువ్యాధులకు సంబంధించిన పరిశోధనల్లో టీకాలు, చికిత్సకు కావాల్సిన పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నా యి. ప్రతిఒక్కరూ తమ వంతుగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మేలు. కంగారుపడొద్దు: ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ప్రతి ఒక్కరూ ఏడాదికి రెండుసార్లు ఐదు రకాల రక్త పరీక్షలు చేయించుకోవటం మేలు.

కంప్లీట్ బ్లడ్ కౌంట్ (సిబిసి) పరీక్ష : రక్తంలో ఎర్ర రక్త కణాలు, తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్ల సంఖ్యను తెలుసుకోవడానికి సిబిసి పరీక్ష దోహదపడుతుంది. ఆరోగ్యం, రక్తహీనత, అంటువ్యాధులు, రక్తం గడ్డకట్టడానికి సంబంధించిన రుగ్మతల నిర్ధారణ గురించి అవసరమైన విషయాలు తెలుస్తాయి. శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిని తెలుసుకోవచ్చు. లిపిడ్ ప్రొఫైల్ : ఈ పరీక్షను అందరూ చేయించుకోవటం మంచిది. కొలెస్ట్రాల్ స్థాయిలు, గుండె ఆరోగ్యానికి సంబంధించిన ఇతర లిపిడ్ మార్కర్లను అంచనా వేయొచ్చు. గుండె సంబంధిత సమస్యల తీవ్రతను అంచనా వేయొచ్చు.

గ్లూకోజ్ పరీక్ష : రక్తంలో చక్కెర స్థాయిలను అంచనా వేయడానికి, మధుమేహం లేదా ప్రీడయాబెటిస్‌ను గుర్తించడంలో ఈ పరీక్ష సహాయపడుతుంది. ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ (ఎఫ్‌బిఎస్). ఇందుకోసం ఖాళీ కడుపుతో ఉన్న సమయంలో పరీక్ష కోసం రక్తం తీసుకుంటారు. ఈ పరీక్ష ద్వారా శరీరానికి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించే స్థాయిని తెలుసుకోవచ్చు. కంట్రోల్ చేసే కెపాసిటీని తెలుసుకోవచ్చు. హిమోగ్లోబిన్ ఏ1సి : ఈ పరీక్ష ద్వారా రెండు నుంచి మూడు నెలల్లో రక్తంలో చక్కెర స్థాయిలను తెలుసుకోవచ్చు. ఒకవేళ మధుమేహం లేదాప్రీ డయాబెటిస్ గుర్తించొచ్చు. సరైన చికిత్సతీసుకోవడంవల్ల గుండె జబ్బులు, కిడ్నీ వ్యాధులు, నరాలు దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు. చికిత్సలే మేలు: ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలొచ్చినా నిర్లక్ష్యం చేయకుండా సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించటం మేలు.

త్వరితగతిన వ్యాధి నిర్ధారణ చేసుకుని చికిత్స పొందడం ద్వారా వ్యాధి త్వరగా నయం చేసుకోవచ్చు. వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

# ఫస్ట్ నుంచి ఇంటింటి సర్వే






**ఒంగోలు,తెలంగాణ దిశ :**ఏపీలోని కూటమి ప్రభుత్వం పేద వర్గాల ప్రజలు, మహిళల ఆర్థిక అభివృద్ధికోసం కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ క్రమంలో అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటుంది. అయితే, తాజాగా.. ఏపీలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటి సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రతి ఇంటి వివరాలను ప్రభుత్వ రికార్డులలో ఖచ్చితంగా నమోదు చేసేందుకు ఈ సర్వే నిర్వహించనున్నారు. ఏకీకృత కుటుంబ సర్వే –జఈబా ప్రారంభిస్తున్నట్లు తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డిసెంబర్ నెల చివరి వారం నుంచి ఏకీకృత కుటుంబ సర్వే ప్రారంభమవుతుందని ప్రభుత్వం వెల్లడించిందిపట్టణాల్లో సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ప్రస్తుత పరిస్థితిని తెలుసుకుని రికార్డులను సిబ్బంది నవీకరించనున్నారు. అర్హత కలిగిన కుటుంబం, వ్యక్తి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడమే లక్ష్యంగా ఈ సర్వేను ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సర్వే ద్వారా వచ్చిన సమాచారం ఆధారంగా నిజమైన అర్హులను ప్రభుత్వం గుర్తించనుంది.ప్రభుత్వ సమాచారం కచ్చితత్వం, పరిపూర్ణతను మెరుగుపర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సర్వేను నిర్వహించనుంది. కుటుంబ వివరాలను నేరుగా ఇంటి వద్దకు వెళ్లి సిబ్బంది పొందుపర్చనున్నారు. ప్రభుత్వం ఖచ్చితంగా డేటా రూపొందించడం సహా పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు అవకాశం ఉంటుంది.ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా ప్రభుత్వ సిబ్బంది సర్వేను చేపట్టనున్నారు. తద్వారా సమాచారం ఖచ్చితంగా నమోదు అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ప్రభుత్వ పాలన మరింత పారదర్శకంగా సాగేందుకు సర్వే ఉపయోగపడుతుందని ప్రభుత్వం తెలిపింది. అర్హులైన అన్ని కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు, సేవలను అందించేందుకు ఈ సర్వే చేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# బెజవాడలో 51 పంచాయితీల విలీనం

**విజయవాడ,తెలంగాణ దిశ :** అమరావతి రాజధాని నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. రాజధానిలో నవ నగరాలు నిర్మించాలన్నది చంద్రబా బు ప్రణాళిక.మరోవైపు విజయవాడ,గుంటూరునగరాల తో అమరావతి ని కలుపుతూ అభివృద్ధి చేస్తారని అంతా భావించారు. కానీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వేరే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. అమరావతికి ఇంకా నగర రూపురేఖలు ఏర్పడకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఆలోచిస్తోంది. పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు ఐటీకంపెనీలను తీసుకురావాలన్న ఆలోచన తోఉంది. అందుకే ఇప్పుడు విజయవాడ ను గుర్తించి గ్రేటర్ గా మార్చాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు 75 గ్రామ పంచాయతీలను విజయవాడ నగరపాలక సంస్థలో విలీన ప్రతిపాదన త్వరలో అమలు చేయనున్నట్లు సమాచారం. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ను గ్రేటర్ సివిక్ బాడీగా అప్గ్రేడ్ చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని తో పాటు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సీఎం చంద్రబాబు నాయుడు ను కలిసి మహా విజయవాడ ప్రతిపాదనలను అందించారు. దీంతో విజయవాడ మహానగరం ఆవిర్భావానికి అడుగులు పడినట్లు అయింది. 2017లో నగరపాలక మండలి 51 పంచాయితీల విలీనం ప్రతిపాదన చేయగా.. ఇప్పుడు ఆ జాబితాలో మరో 24 పంచాయితీలను చేర్చారు. దీంతో విజయవాడ ప్రస్తుత జనాభా 23.5 లక్షల నుంచి రెట్టింపు కానుంది. నగర పరిమాణం ఐదు రెట్లు పెరగనుంది. ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ఆమోదిస్తే విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రస్తుతం ఉన్న 61.8 చదరపు కిలోమీటర్ల నుంచి.. 500 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది.ఈ విలీన ప్రతిపాదనను ఏపీ ప్రభుత్వం ఆమోదిస్తే.. విశాఖపట్నందాటి రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ గా విజయవాడ అవతరించనుంది. అయితే ఈ విలీన ప్రతిపాదనను చాలామంది వ్యతిరేకిస్తున్నారు. విలీనం కాకుండా వికేంద్రీకరణ కావాలని కోరుతున్నారు. ఈ ప్రతిపాదనపై పౌర సంఘాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం విజయవాడ ఆంధ్రప్రదేశ్ లో రెండో అతిపెద్ద నగరంగా ఉంది. గ్రేటర్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా కొన్ని వర్గాలు వ్యతిరేకించడం జరుగుతోంది. గతంలో హైదరాబాద్ విషయంలో కూడా ఇలానే జరిగింది. ప్రభుత్వం మాత్రం స్ట్రాంగ్ గా నిర్ణయించుకుంటే మాత్రం విజయవాడ గ్రేటర్ గా మారడం ఖాయం.తాజాగా విజయవాడను గ్రేటర్ సిటీగామార్చాలన్న ప్రతిపాదన వచ్చిన నేపథ్యంలో.. అమరావతిలో కలపాలన్న డిమాండ్ తెరమరుగు అయినట్టే. అయితే ఇప్పుడు రాష్ట్రానికి రాజధానికి దగ్గరగా ఒక నగరం అవసరం. ఐటీ పరిశ్రమలన్నీ విశాఖకు వెళ్ళిపోతున్నాయి. ఈ క్రమంలో అమరావతిరాజధానిలో ఎటువంటి పెట్టుబడులు లేవన్న విమర్శలు వస్తున్నాయి. అందుకే గ్రేటర్ విజయవాడ ప్రతిపాదనను ఆమోదించి.. మహానగరంలో పెట్టుబడులు ఆకర్షించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# ఇండియాలో కొత్తగా 3 విమానయాన సంస్థలు



న్యూఢిల్లీ,: ఇండిగో సంస్థ చేసిన నిర్వాకం వల్ల దేశంలో ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడింది. దేశంలోని అన్ని విమానాశ్రయాలలో ప్రయాణికులు గంటల తరబడి పడికాపులు కాయాల్సి వచ్చింది. దీంతో భారత్ పరువు పోయింది. ఫలితంగా భారత ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంది. ప్రతిపక్షాల అయితే కేంద్ర ప్రభుత్వాన్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాయి. ఒకానొక దశలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆరోపణలు ఎదుర్కోవాల్సి వచ్చిందిఇండిగో సంస్థ ఇచ్చిన షాక్ నుంచి కేంద్ర ప్రభుత్వం త్వరగానే మేల్కొంది. నేపథ్యంలో దేశంలో మరో రెండు విమాన సంస్థలకు పౌర విమానయాన శాఖ అనుమతులు ఇచ్చింది.

ఆల్ హింద్ ఎయిర్, ఫ్లై ఎక్స్ ప్రెస్ సంస్థలకు కేంద్రం అనుమతి ఇచ్చింది. పౌర విమానయాన శాఖ నుంచి ఈ సంస్థలకు నిరభ్యంతర పత్రాలు కూడా మంజూరయ్యాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మరో సంస్థ శంక్ ఎయిర్ అనే సంస్థకు కూడా ఇప్పటికే కేంద్రం నిరంతర పత్రం ఇచ్చింది. వచ్చేయడాల నుంచి ఆ సంస్థ కార్యకలాపాలు మొదలు పెట్టనుంది.ఇటీవల దేశీయ ఇండిగో సంస్థలో సంక్షోభం ఏర్పడింది. దీంతో దేశవ్యాప్తంగా కొద్ది రోజులపాటు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో అనేకమంది ప్రయాణికులు విమానాశ్రయాలలో చిక్కుకుపోయారు. ఈ వ్యవహారంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పార్లమెంట్లో సుదీర్ఘంగా ప్రసంగించారు. విమానయాన రంగంలో ఏ సంస్థ పూర్తి స్థాయిలో ఆధిపత్యం కొనసాగించడానికి తాను ఆస్కారం ఇవ్వడం లేదని.. ఇంకా చాలా సంస్థలను ఈ రంగంలోకి ఆహ్వానిస్తున్నట్టు ప్రకటించారు. అంతేకాదు కొత్త సంస్థలు కార్యకలాపాలు సాగించడానికి ఇదే అనుకూలమైన సందర్భం అని ఆయన పేర్కొన్నారు. ఇక మన దేశంలోని విమానయాన రంగంలో ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు 90% వాటా కలిగి ఉన్నాయి. ఇందులో ఇండిగో కే 65% వాటా ఉండడం విశేషం.

కేంద్రం తీసుకొచ్చిన నిబంధనల నేపథ్యంలో ఇండిగో సంస్థ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సర్వీసులను అప్పటికప్పుడు రద్దు చేసింది. కొన్ని సర్వీస్లను దారి మళ్ళించింది. దీంతో దేశవ్యాప్తంగా అనేక విమానాశ్రయాలలో ప్రయాణికులు నరకం చూశారు. సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు విమానాశ్రయాలకే పరిమితం కావలసి వచ్చింది. ఈ పరిణామం నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్ర నిర్ణయం పట్ల ప్రయాణికులనుంచి సానుకూల స్పందన వ్యక్తం అవుతుంది. ఈ నిర్ణయం ఎప్పుడో తీసుకొని ఉంటే బాగుండేదని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

## సాఫ్ట్ బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక




**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు పాలకుర్తి మండలం జిడి నగర్ యూనివర్సల్ పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఇస్మాయిల్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల మైదానంలో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 27,28 మరియు 29 తేదీలలో మెదక్ జిల్లా మనోహ రాబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు యూనివర్సల్ పాఠశాల విద్యార్థి అల్లాడి ధనుష్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కల్వల సంతోష్ తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మొహమ్మద్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అఫ్జల్ విద్యార్థిని అభినందించారు.

## మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి



**కమాన్ పూర్,తెలంగాణ దిశ :**కమాన్ పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి అని గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ సిబ్బందికి సూచించారు. ఆయన కమాన్ పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ వాడల్లో పర్యటించారు. బాపూజీ నగర్ లోని మురికి కాలువలో మట్టితో పేరుకుపోయిందని దీనివల్ల నీటి ప్రవాహం వెళ్లక ఆ ప్రాంతంలో దుర్గంధం వెద జల్లుతోంది. అని అని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రతి సమస్య తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరిస్తానని ఆయన అన్నారు. కాల్వలోని మట్టిని తొలగించేలా చర్యలు తీసుకుంటానని సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు.

# తమ్మినేనికి చెక్...



**శ్రీకాకుళం,తెలంగాణ దిశ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కట్టు దాటు తోంది. నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు విషయంలో నేతలు చేస్తున్న ప్రకటనలు ప్రకంపనలు రేపుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో తాజాగా సీనియర్ నేత ధర్మాన కృష్ణ దాస్ చేసిన ప్రకటన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఇబ్బందుల్లో పెట్టినట్టు ఉంది. సీనియర్ నేతగా ఉన్న ధర్మాన కృష్ణ దాస్.. ఆ జిల్లా పార్టీ అధ్యక్షుడు కూడా. అయితే వచ్చే ఎన్నికల్లో తమ్మినేని పోటీ విషయంలో ఆయన చేసిన ప్రకటన మాత్రం పొలిటికల్ వర్గాల్లో హీట్ రేపుతోంది. వచ్చే ఎన్నికల్లో తమ్మినేని సీతారామును తప్పించి మరొకరిని పోటీ చేయిస్తామన్న ధర్మాన కృష్ణ దాస్ ప్రకటనపై దువ్వాడ శ్రీనివాస్ విభిన్న ప్రకటనలు చేస్తున్నారు. కాళింగ సామాజిక వర్గాన్ని తెరపైకి తెస్తున్నారు.కొద్దిరోజుల కిందట దువ్వాడ శ్రీనివాస్ పై సస్పెన్షన్ వేటు వేసింది హై కమాండ్. వ్యక్తిగత కుటుంబ వివాదాలతో ఆయనపై వేటు వేయాల్సి వచ్చింది. అయితే దీని వెనుక ధర్మాన బ్రదర్స్ కుట్ర ఉంది అన్నది దువ్వాడ చేస్తున్న ఆరోపణ. కింజరాపు కుటుంబంతో కలిపి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపణ చేస్తున్నారు. తన ఓటమి వెనుక ధర్మాన కుటుంబ హస్తం ఉందని కూడా సంచలన ఆరోపణలు చేశారు. ఈ పరిస్థితుల్లో ధర్మాన బ్రదర్స్ పై పెద్ద యుద్ధమే ప్రకటించారు దువ్వాడ. దానికి కాళింగ సామాజిక వర్గం ను అడ్డం పెట్టుకొని రాజకీయం చేయడం మొదలుపెట్టారు. ఆ సామాజిక వర్గం ద్వారానే తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి రీఎంట్రీ ఇవ్వడానికి ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదు.అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆమదాలవలస నియోజకవర్గ వైసిపి ఇన్చార్జిగా ఉండేవారు. ఆయనను తప్పించి యువకుడైన చింతాడ రవికుమార్ కు ఆ బాధ్యతలు అప్పగించారు వర్గానికి చెందిన నేత. ఇటువంటి పరిస్థితుల్లో టెక్కలి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయ సమావేశానికి జిల్లా అధ్యక్షుడి హోదాలో హాజరయ్యారు కృష్ణదాస్. ఈ క్రమంలో వచ్చే పార్లమెంటరీ ఎన్నికల్లో రామ్మోహన్ నాయుడుకు ధీటుగా సరైన అభ్యర్థిని రంగంలోకి దించుతామని చెప్పుకొచ్చారు. అయితే వచ్చే ఎన్నికల్లో ఎంపీగా తమ్మినేని పోటీ చేస్తారని ప్రచారం నడిచింది. అయితే ఆయనకు పెద్దల సభకు కానీ ఎమ్మెల్సీ పదవి గానీ ఇస్తామని కృష్ణ దాస్ చెప్పడం దువ్వాడ శ్రీనివాస్ ఆయుధంగా మలుచుకున్నారు. కాళింగ సామాజిక వర్గాన్ని తరుపైకి తెస్తూ.. కింజరాపు, ధర్మాన బ్రదర్స్ ను కేడి బ్రదర్స్ తో పోల్చారు. వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నేరుగా హెచ్చరించలేదు. కానీ ధర్మాన బ్రదర్స్ కు హెచ్చరించడం ద్వారా హై కమాండ్ కు పరోక్ష సంకేతాలు పంపగలిగారు.

# సెంటిమెంట్ నుంచి సమస్యల దిశగా




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** అసెంబ్లీ ఎన్నికల తర్వాత బలహీనంగా కనిపిస్తున్న భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఇప్పుడు పూర్తిగా మారిన వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఒకప్పుడు సెంటిమెంట్ ఆధారంగా నడిచిన పార్టీ, ఇప్పుడు ప్రజా సమస్యలను ఆయుధంగా మార్చుకుంటూ "గ్రౌండ్ లెవల్ రీకనెక్ట్" పై దృష్టి సారించింది. పైకి ప్రశాంతంగా కనిపిస్తున్నా, లోపల మాత్రం గులాబీ దళం పునర్వ్యవస్థీకరణకు అధినేత కేసీఆర్ నిశ్శబ్దంగా కార్యాచరణ చేపట్టారు.పార్టీని మళ్లీ బలోపేతం చేయాలంటే క్షేత్రస్థాయి నుంచి మొదలు పెట్టాలనే నిర్ణయానికి బీఆర్ఎస్ వచ్చింది. అందుకే ఇప్పుడు హైదరాబాద్ రాజకీయాలకు పరిమితం కాకుండా జిల్లాలపై ఫోకస్ పెంచుతోంది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేరుగా బాధితుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వంపై విమర్శలు మోస్తున్నారు.భూసేకరణ, భూముల వివాదాలు, రైతుల సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలపై ప్రత్యక్షంగా స్పందిస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఖమ్మం, నాగర్ కర్నూల్ వంటి జిల్లాల్లో ఇప్పటికే పర్యటనలు ప్రారంభించారు. త్వరలో రైతు ఆత్మహత్యల కుటుంబాలను కూడా పరామర్శించేలా ప్లాన్ చేస్తున్నారు.ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ కేంద్రంగా కేసీఆర్ రాజకీయ వ్యూహాలు రచిస్తున్నారు. బయటకు పెద్దగా కనిపించకపోయినా, పార్టీని మళ్లీ నిలబెట్టేందుకు క్రమంగా పావులు కదుపుతున్నారు. నియోజకవర్గాల వారీగా కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ ఓటమి కారణాలను విశ్లేషిస్తున్నారు.కార్యకర్తల్లో నెలకొన్న నిరుత్సాహాన్ని తొలగించి, "మళ్లీ మనదే పాలన" అనే నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం జరుగుతోంది. అలాగే సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక బృందాలను కూడా సిద్ధం చేస్తున్నారు.పార్టీ నుంచి కొందరు నేతలు వెళ్లిపోతున్నా, కేసీఆర్ మాత్రం తొందరపడటం లేదు. పార్టీ మారే వారిని ఆపేందుకు కంటే, మిగిలిన నిబద్ధత గల నాయకులతో బలమైన బృందాన్ని నిర్మించాలనే దిశగా అడుగులు వేస్తున్నారు.ద్వితీయ శ్రేణి నాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తూ, ప్రతి మండలానికి ఇన్‌ఛార్జ్‌లను నియమించాలనే ఆలోచనలో ఉన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటినుంచే క్యాడర్‌ను సిద్ధం చేస్తున్నారు.గతంలో తెలంగాణ సెంటిమెంట్‌పై ఆధారపడి విజయాలు సాధించిన బీఆర్ఎస్, ఇప్పుడు పూర్తిగా ప్రజా సమస్యలపై దృష్టి మళ్లిస్తోంది. నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, పెన్షన్ల పంపిణీలో జాప్యం వంటి అంశాలను ప్రభుత్వంపై అస్త్రాలుగా ఉపయోగించేందుకు సిద్ధమవుతోందిప్రజా సమస్యలపై పోరాటం ద్వారా కోల్పోయిన విశ్వాసాన్ని తిరిగి సంపాదించుకోవచ్చని పార్టీ భావిస్తోంది. శాసనసభలో కూడా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు.బయటకు నిశ్శబ్దంగా కనిపిస్తున్నా, బీఆర్ఎస్ లోపల భారీ మార్పులు జరుగుతున్నాయి. సరైన సమయం చూసి పార్టీని పూర్తిగా రీ యాక్టివేట్ చేయాలనే లక్ష్యంతో కేసీఆర్ ముందుకు సాగుతున్నారు. గోదావరి జలాల పేరుతో బహిరంగ సభల ద్వారా పార్టీకి కొత్త ఊపు తీసుకురావాలని భావించినా, ఎన్నికల నేపథ్యంలో ఆ ప్లాన్ వాయిదా పడింది. అయితే,పరిస్థితులు అనుకూలంగా మారిన వెంటనే గులాబీ దళం మళ్లీపూర్తి స్థాయిలో రంగంలోకి దిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఓటమి తర్వాత వెనక్కి తగ్గినట్టుగా కనిపించిన బీఆర్ఎస్, ఇప్పుడు కొత్త రూపంలో తిరిగి వస్తోంది. కేసీఆర్ సైలెంట్ ఆపరేషన్, కేటీఆర్ గ్రౌండ్ యాక్టివిటీ, కొత్త నాయకత్వం కలయికతో గులాబీ దళం మళ్లీ బలపడుతుందా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# కేబీఆర్ పార్క్ చుట్టూ 7 ఫ్లైఓవర్లు



హైదరాబాద్, : హైదరాబాద్‌లో సిగ్నల్ ఫ్రీ జంక్షన్‌లు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని సీపీ సజ్జనార్ వెల్లడించారు. హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్కు వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్లు, అండర్ పాస్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. కేబీఆర్ పార్కు చుట్టూ రానున్న 2 ఏళ్లలో 7 ఫ్లైఓవర్లు, 7 అండర్‌పాస్‌లు అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా రాత్రివేళల్లో పనులు కొనసాగుతాయని తేల్చి చెప్పారు.విశ్వ నగరంగా మారిన హైదరాబాద్‌లో ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు సమర్థవంతంగా నియంత్రించేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత 12 ఏళ్లలో హైదరాబాద్ నగరంలో ఎన్నో ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, స్టీల్ బ్రిడ్జిలను నిర్మించారు. దీంతో రోజురోజుకూ పెరుగుతున్న నగర జనాభాకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పీక్ అవర్స్‌లో గంటల తరబడి ట్రాఫిక్‌లో వేచిచూడాల్సిన దుస్థితి నగరవాసులకు కలుగుతోంది. అయితే వాటిని కూడా తప్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.


భవిష్యత్‌లో పెరగనున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు తీసుకుంటోంది.నగరంలో రానున్న రోజుల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని.. ప్రభుత్వం చేపట్టిన హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ) ప్రాజెక్ట్ పనులు జోరందుకున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2 లోని ముగ్ధ జంక్షన్ వద్ద నిర్మిస్తున్న స్టీల్ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ శుక్రవారం పరిశీలించారు. జీహెచ్ఎంసీ, మేఘా ఇంజినీరింగ్ ప్రతినిధులు, పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి సజ్జనార్ ఆ ప్రాంతాన్ని పర్యవేక్షించారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ లేని రోడ్ల వ్యవస్థను తీసుకురావడమే లక్ష్యంగా ఈ ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నట్లు సజ్జనార్ వెల్లడించారు. మరీ ముఖ్యంగా కేబీఆర్ పార్కు చుట్టూ సిగ్నల్ ఫ్రీ జర్నీ కోసం రానున్న 2 ఏళ్లలో మొత్తం 7 ఫ్లై ఓవర్లు, 7 అండర్ పాస్‌లను నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, పోలీసు అధికారుల సమన్వయంతో నగరవాసులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ ఫ్లై ఓవర్, అండర్ పాస్‌లను దశలవారీగా నిర్మించనున్నట్లు వివరించారు. శుక్రవారం రాత్రి నుంచే ముగ్ధ జంక్షన్ నుంచి కేబీఆర్ పార్కు వైపు మార్గంలో 6 పిల్లర్ల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.అయితే రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పగలు ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కేవలం.. రాత్రి పూటే ముమ్మరంగా పనులు కొనసాగుతాయని సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ పిల్లర్ల పునాదులు పూర్తి అయ్యే వరకు మాత్రం వాహనదారులకు ఇబ్బంది ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత యథావిధిగా వాహనాల రాకపోకలు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక హెచ్ సిటీ ప్రాజెక్ట్ పూర్తి అయితే కేబీఆర్ పార్క్ ప్రాంతంలో పూర్తిగా సిగ్నల్ ఫ్రీ జంక్షన్ అందుబాటులోకి వస్తుందని వివరించారు. దీంతో హైదరాబాద్ నగరంలోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ ప్రాంతాలకు వేగంగా, సాఫీగా ప్రయాణించే అవకాశం ఉంటుందని తెలిపారు.అయితే ఈ నిర్మాణ పనుల కారణంగా ఆయా మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు తప్పవని సజ్జనార్ తెలిపారు. ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో పెట్టుకుని వాహనదారులు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని హితవు పలికారు. రద్దీ నివారణకు ప్రజా రవాణాను ఉపయోగించుకోవాలని సూచించారు. పనులు ప్రారంభమైన తర్వాత ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేస్తామని తెలిపారు. నగర అభివృద్ధి కోసం చేపట్టే ఈ నిర్మాణ పనులకు నగరవాసులు అధికారులకు సహకరించాలని సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# మండలిలో మంటలు

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఏపీలో మండలి సమావేశాలు ఇంట్రెస్టింగ్‌గా నడుస్తున్నాయి. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అయినా.. ఇప్పుడు కూటమి పవర్‌లో ఉండగా..మండలిలో మాత్రమే చర్చ జరుగుతుండటం ఆసక్తికరంగా మారింది. 2020లో మండలిలో టీడీపీ బలంగా ఉండేది. అప్పుడు అసెంబ్లీలో వైసీపీకి 151 సీట్లు ఉండటంతో వార్ వన్ సైడ్ అన్నట్లుగా సమావేశాలు నడిచాయి. టీడీపీ సభకు వెళ్లినా గొడవ జరగడం, వాకౌట్‌లు అంటూ నిరసన వ్యక్తం చేయడం నడిచేవి. దీంతో సంఖ్యాపరంగా అప్పుడు వైసీపీ అసెంబ్లీలో బలంగా ఉండటంతో వారిదే అప్పర్ హ్యాండ్‌గా ఉండేది.అదే సమయంలో మండలిలో మాత్రం అప్పుడు టీడీపీ బలంగా ఉంటూ పోరాడుతూ వచ్చింది. అప్పుడు టీడీపీకి మండలిలో ఎమ్మెల్సీల బలం ఉండటంతో పాటు ఛైర్మన్ కూడా ఆ పార్టీ నియమించిన వ్యక్తి ఉండటంతో..పెద్దల సభలో వైసీపీ దూకుడును అడ్డుకోగలిగింది. అమరావతి బిల్లును వైసీపీ ప్రభుత్వం అసెంబ్లీలో పాస్ చేసినా..మండలికి వచ్చేసరికి టీడీపీ బ్రేకులు వేయడంతో ఆగిపోయింది. దీంతో ఒకానొక సమయంలో అప్పటి వైసీపీ సర్కార్ మండలిని రద్దు చేసే ఆలోచన కూడా చేసింది.ఇప్పుడు సీన్ మారింది. సీట్లు కూడా మారాయి. విపక్షంలో ఉన్న వైసీపీ అసెంబ్లీకి వెళ్లడం లేదు. మండలిలో మాత్రం తమకున్న బలంతో స్ట్రాంగ్ వాయిస్ వినిపించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీలో 164 సీట్లతో బలంగా ఉన్న కూటమి అక్కడ తమ వాయిస్‌ను వినిపిస్తూ, వైసీపీ తప్పులను ఎత్తిచూపుతోంది. మండలిలో వైసీపీ బలంగా ఉండటంతో..కూటమి సర్కార్ ఏం చేసినా అడ్డుకుంటుండంతో కూటమికి అక్కడ సవాల్‌గా మారింది. కల్తీ నెయ్యిపై చర్చ సందర్భంగా..రచ్చ రచ్చ అయింది. కల్తీ నెయ్యి అంశంపై షార్ట్ డిస్కషన్‌కు ఛైర్మన్ మోషేన్ రాజు అనుమతించారు. వైసీపీ సభ్యుడు పి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. అయితే స్వల్పకాలిక చర్చ కోసం వైసీపీ నోటీసు ఇవ్వకపోయినా..ఆ పార్టీ సభ్యుడికి మాట్లాడే అవకాశమిచ్చారంటూ టీడీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందిసేమ్‌టైమ్ దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి కల్తీ నెయ్యి అంశంపై ప్రకటన చేసేందుకు లేచి నిలబడ్డారు. అయినా మండలి ఛైర్మన్..వైసీపీ సభ్యుడికే లఘు చర్చను ప్రారంభించే అవకాశం ఇచ్చారంటూ టీడీపీ మరోసారి అబ్జక్షన్స్ వ్యక్తం చేసింది. ఈ సమయంలో మంత్రి పయ్యావుల కేశవ్, మండలి ఛైర్మన్ మోషేన్ రాజు మధ్య తీవ్ర వాదనలు జరిగాయి. వైసీపీ ఇవ్వని నోటీసును ఇచ్చినట్లుగా భావించి లఘు చర్చకు అనుమతించడమే కాకుండా, ప్రభుత్వం తరఫున ప్రకటనకు నిరాకరించడం సరైంది కాదంటూ..టీడీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వాదోపవాదాలు, అధికార-విపక్ష సభ్యుల ఆందోళనలతో మండలిలో గందరగోళం ఏర్పడింది. చర్చ జరగకుండానే సభ వాయిదా పడింది.అయితే ఇప్పుడు మండలిలో వైసీపీకి మెజార్టీ ఉంది. పైగా మండలి ఛైర్మన్ మోషేన్ రాజు కూడా వైసీపీ హయాంలో నియమించబడ్డారు. దీంతో పెద్దల సభలో ఆ పార్టీ అప్పర్ హ్యాండ్ సాధించే ప్రయత్నం చేస్తుందన్న చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే షార్ట్ డిస్కషన్‌పై నిబంధనలు పక్కన పెట్టి మండలి ఛైర్మన్ వ్యవహరించారని టీడీపీ ఆరోపిస్తుంది. మోషేన్ రాజు మాత్రం..అధికార పక్షం అలిగేషన్స్‌ను తప్పుబడుతున్నారు. నోటీస్ విషయంలో పక్కదారి పట్టించేలా మాట్లాడటం సరికాదంటున్నారు. దీంతో మండలిలో కూటమి వర్సెస్ వైసీపీ ఫైట్ ఆసక్తికరంగా మారింది.మరోవైపు మండలిలో అప్పర్ హ్యాండ్ సాధించేందుకు కూటమి ప్లాన్స్ చేస్తుంది. ఇప్పటికే ఆరుగురు వైసీపీ ఎమ్మెల్సీలు కూటమి పార్టీల్లో చేరారు. ఇందులో ఐదుగురు రాజీనామా చేయగా..స్పీకర్ వారికి నోటీసులు ఇచ్చి వివరణ తీసుకుం టున్నారు. ఈ ఐదుగురి రాజీనామాలను మండలి ఛైర్మన్ ఆమోదిస్తే..ఆ సీట్లు కూటమి ఖాతాలోకి వెళ్లనున్నాయి. అప్పుడు మండలిలో కూటమి బలం పెరగనుంది. తర్వాత మరికొంతమంది వైసీపీ ఎమ్మెల్సీలను కూడా ఫ్యాన్ స్విచ్చాఫ్ చేసి కూటమి గూటికి చేరేందుకు రెడీగా ఉన్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. సేమ్‌టైమ్ కొందరు ఎమ్మెల్సీల పదవీకాలం కూడా ముగియనుంది. ఈ సీట్లు కూడా కూటమినే కైవసం చేసుకోనుంది. ఏదైనా మండలిలో జరుగుతున్న ఫైట్..పొలిటికల్ హాట్ టాపిక్‌గా..పబ్లిక్ అటెన్షన్‌ను గ్రాబ్ చేసేలా ఉందనడంలో డౌటే లేదు.

# కష్టాల్లో ఉన్నా నోరుతెరవని ఫైర్ బ్రాండ్స్

**విజయవాడ,తెలంగాణ దిశ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలామంది ఫైర్ బ్రాండ్లు ఉన్నారు. ఎందుకో గాని వారంతా ఇప్పుడు సైలెంట్‌గా ఉన్నారు. అసలు వారు యాక్టివ్ అవుతారా? లేదా? అనే చర్చ బలంగా నడుస్తోంది. ఎందుకంటే ఇప్పుడు పార్టీ కష్టకాలంలో ఉంది. వారి అవసరం పార్టీకి ఏర్పడింది. అయినా సరే వారి పెద్దగా నోరు తెరవడం లేదు. ఏదో పార్టీలో ఉన్నాం అంటే ఉన్నాం అన్నట్టు ఉంది వారి వ్యవహారం. కనీసం నోరు తెరవడం లేదు కూడా వారు. కూటమి ప్రభుత్వం నుంచి నెయ్యి కల్తీ వ్యవహారంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇటువంటి సమయంలో అండగా నిలవాల్సిన ఈ ఫైర్ బ్రాండ్లు అంతా ముఖం చాటేస్తుండడం మాత్రం విమర్శలకు తావిస్తోంది. పార్టీ కష్టంలో ఉన్నప్పుడే స్పందించాలి కానీ.. పార్టీ బాగున్నప్పుడు ఎందుకులే అనే ప్రశ్న వినిపిస్తోంది.ఎవరు అవునన్నా కాదన్నా నెయ్యి కల్తీ వ్యవహారంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ డ్యామేజ్ జరిగింది. దానిని కంట్రోల్ చేసే పనిలో భాగంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బలమైన వాయిస్ వినిపిస్తోంది. కానీ ఇది చాలడం లేదు. ఎవరో ఒకరిద్దరు మాత్రమే స్పందిస్తున్నారు. ముఖ్యంగా మాజీ మంత్రులు ఆర్కే రోజా, అనిల్ కుమార్ యాదవ్, కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్ వంటి వారు నోరు తెరవకపోవడం పై రకరకాల చర్చ నడుస్తోంది. 2014 నుంచి 2019 వరకు వైయస్సార్ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. 2019 నుంచి 2024 మధ్య అధికారంలో ఉన్నప్పుడు.. వీరు ఓ స్థాయిలో రెచ్చిపోయేవారు. అధినేత జగన్ పై ఈగ వాలనిచ్చేవారు కాదు. కానీ ఇప్పుడు అమాంతం పెద్దపెద్ద నిందలు, ప్రత్యర్థుల బలమైన ఆరోపణలు




చేస్తున్నా స్పందించకపోవడం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది.పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చాలామంది మాట్లాడతారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడితేనే.. పార్టీ తరఫున వాయిస్ వినిపిస్తేనే ఫలితం ఉంటుంది. అయితే వైసిపి హయాంలో ఫైర్ బ్రాండ్లుగా పేరు పొందిన ఈ నేతలంతా ఆడిన మాటలు రాష్ట్ర ప్రజలకు తెలియంది కాదు. అందుకే ఫలానా ఫైర్ బ్రాండ్ ఏమైపోయారు అని ప్రజలు ఇప్పుడు ఆరా తీయడం చూస్తున్నాం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఒకరిద్దరు నేతలు మాత్రమే మాట్లాడుతున్నారు. మిగతావారు మాత్రం ఫుల్ సైలెన్స్ పాటిస్తున్నారు. అందుకే సోషల్ మీడియాలో సెటైర్లు పడుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫైర్ బ్రాండ్లకు ఏమైందని ఎక్కువ మంది ప్రశ్నిస్తున్నారు. అయితే ఇందులో కొందరు తమ సొంత వృత్తులు, వ్యాపారాలు చేసుకుంటున్నారు. పరిస్థితికి తగ్గట్టు బయటకు రావాలని భావిస్తున్నారు. అప్పటివరకు సైలెంట్ మోడ్ లో ఉండడమే ఉత్తమని ఒక నిర్ణయానికి వచ్చారన్నమాట.

# హీట్ ఎక్కుతున్న బెంగాల్ రాజకీయం

కోల్ కత్తా, : పశ్చిమ బెంగాల్ రాజకీయ రణరంగం మరోసారి హీటెక్కుతోంది. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం అటు అధికార తృణమూల్ కాంగ్రెస్, ఇటు దూసుకొస్తున్న భారతీయ జనతా పార్టీ మధ్య చావో రేవో తేల్చుకునే పోరు మొదలైంది. పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఎన్నడూ లేని విధంగా ముక్కోణపు పోటీ పోయి, ఇప్పుడు నేరుగా టీఎంసీ వర్సెస్ బీజేపీ మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. 2019 లోక్‌సభ ఎన్నికల నుంచి బెంగాల్‌లో పాగా వేయడమే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ, ఈసారి రాష్ట్రమంతటా భారీగా కేడర్‌ను మోహరించింది. ముఖ్యంగా ఉత్తర బెంగాల్ మరియు గిరిజన ప్రాంతాల్లో బీజేపీ పట్టు పెంచుకుంటూ వస్తోంది. ప్రధాని మోదీ, అమిత్ షా వంటి అగ్రనేతలు బెంగాల్‌ను ఒక ప్రతిష్టాత్మక యుద్ధంగా భావించి ప్రతి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. హిందూ ఓట్ల పోలరైజేషన్ తమకు కలిసొస్తుందని బీజేపీ బలంగా నమ్ముతోంది.మరోవైపు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బెంగాల్ కుమార్తెను అనే సెంటిమెంట్‌తో ప్రజల్లోకి వెళ్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లక్ష్మీర్ భండార్ వంటి సంక్షేమ పథకాలు మహిళా ఓటర్లను కట్టిపడేశాయి. అయితే, సందేశ్‌ఖాలీ వంటి ఘటనలు, టీఎంసీ స్థానిక నాయకులపై వస్తున్న అవినీతి ఆరోపణలు మమతా ప్రభుత్వానికి కొంత ఇబ్బందికరంగా మారాయి. ముస్లిం ఓటు బ్యాంకు చెల్లాచెదురు కాకుండా చూసుకోవడం మమతకు ఇప్పుడు కీలకం. ఈసారి ఎన్నికల్లో దీదీ తన వ్యక్తిగత చరిష్మాపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు.ఒకప్పుడు బెంగాల్‌ను దశాబ్దాల పాటు ఏలిన కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ రెండు పార్టీలు మనుగడ కోసం పోరాడుతున్నాయి. లెఫ్ట్ పార్టీల ఓటు బ్యాంకు ఇప్పటికే పెద్ద ఎత్తున బీజేపీ వైపు మళ్లిపోయింది. యువతను ఆకట్టుకోవడానికి కమ్యూనిస్టులు కొత్త ముఖాలను రంగంలోకి దించుతున్నా, అది ఎన్నికల ఫలితాల్లో సీట్లుగా మారడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ పార్టీ కేవలం మాల్దా, ముర్షిదాబాద్ వంటి కొన్ని పాకెట్లకే పరిమితం కానుంది. బీజేపీకి ఈసారి అధికారంలోకి రావడానికి గతంలో కంటే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని స్థానిక సర్వేలు చెబుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన అసంతృప్తిని ఓట్లుగా మలుచుకోవడంలో కాషాయ దళం సక్సెస్ అయితే బెంగాల్ చరిత్ర మారుతుంది. అయితే, మమతా బెనర్జీని తక్కువ అంచనా వేయలేం. ఎన్నికల సమయంలో ఆమె చేసే పోరాట పటిమ, వీధి పోరాటాలు చివరి నిమిషంలో ఫలితాలను తారుమారు చేయగలవు. బెంగాల్ పీఠం ఎవరిదనేది ఈసారి అతి తక్కువ ఓట్ల శాతంతో తేలేలా ఉంది. బీజేపీ దండయాత్ర ఫలించి కోటను స్వాధీనం చేసుకుంటుందా..లేక మమత తన బెంగాల్ టైగర్ ఇమేజ్‌తో హ్యాట్రిక్ కొడుతుందా అనేది దేశవ్యాప్తంగా ఉత్కంఠను రేపుతోంది.

# హిందూ వర్సెస్ క్రిష్టియన్.!

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఇప్పుడు సిద్ధాంతాల నుంచిపూర్తిగా విశ్వాసాల వైపు మళ్లుతున్నాయి. గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తే.. రాష్ట్రంలో హిందూ వర్సెస్ క్రిస్టియన్ అనే ధోరణిని రాజకీయ పార్టీలు బలంగా ప్రోత్సహిస్తున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వివాదం తర్వాత అధికార కూటమి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హిందూ వ్యతిరేకి అనే ముద్రను బలంగా వేసేందుకు ప్రయత్నిస్తోంది. జగన్ తన వ్యక్తిగత విశ్వాసం ప్రకారం క్రైస్తవుడు కాబట్టి, ఆయనకు హిందూ ఆచారాలపై గౌరవం లేదనే వాదనను కూటమి నేతలు వినిపిస్తున్నారు.ఈ వ్యూహాన్ని తిప్పికొట్టేందుకు జగన్ మోహన్ రెడ్డి తన రాజకీయ శైలిని మార్చుకుంటున్నారు. తాను కేవలం ఒక మతానికే పరిమితం కాదని, హిందూ ధర్మాన్ని కూడా అంతే గౌరవిస్తానని చాటిచెప్పేందుకు ఆలయ సందర్శనలను పెంచారు. పులివెందులలో నందీశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొనడం ఇందులో భాగమే. అయితే, ఈ క్రమంలో ఆయన కొన్ని సాంకేతిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. హోమగుండం వద్ద పూజారి ఇచ్చిన పదార్థాలను సరిగ్గా వేయకపోవడం ,హిందూ పూజా విధానాల్లో తడబడటం వంటి అంశాలను కూటమి సోషల్ మీడియా విభాగాలు హైలైట్ చేస్తూ ఆయన ప్రయత్నాలను నీరుగారుస్తున్నాయి.జగన్ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ తన ఓటు బ్యాంకును కాపాడుకోవడం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండే సామాజిక వర్గాల్లో క్రైస్తవ మైనారిటీలు ప్రధానమైన వారు. జగన్ హిందూ ఓటర్లను ఆకట్టుకునే క్రమంలో అతిగా హిందూ ఆచారాలను పాటిస్తే, తన సొంత కోర్ ఓటు బ్యాంకులో అసంతృప్తి మొదలయ్యే ప్రమాదం ఉంది. మత రాజకీయాలు మనకెందుకు ' అనే భావన అటు హిందువుల్లోనూ, ఇటు మైనారిటీల్లోనూ కలగకుండా చూసుకోవడం జగన్‌కు ఇప్పుడు కత్తిమీద సాములా మారింది. ఇప్పటికే సోదరి షర్మిల దూకుడుగా రాజకీయం చేస్తున్నారు. ఆమె భర్త అనిల్ కుమార్ సుప్రసిద్ధ మత ప్రచారకుడు. గతంలో జగన్ కోసం చర్చిలను ఏకం చేశారు. ఇప్పుడు వారు కూడా జగన్ కువ్యతిరేకంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం జగన్‌ను ఒక మతానికి మాత్రమే పరిమితం చేసి, హిందూ ఓట్లను ఏకీకృతం చేయాలని చూస్తోంది. దీనికి ప్రతిగా జగన్ సర్వమత సమభావన అనే ముసుగులో హిందుత్వ ఇమేజ్ కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే, ఈ మతపరమైన పోలరైజేషన్ రాష్ట్రంలో రాజకీయాన్ని మార్చబో తోంది. భవిష్యత్తులో జగన్ మరిన్ని దేవాలయ పర్యటనలు చేసినా, కూటమి వేసే మత ముద్ర నుంచి ఆయన ఎంతవరకు బయటపడతారనేది సందేహమే. ఒకవైపు తనపై పడుతున్న క్రైస్తవ ముద్రను తుడిచేసుకోవడం, మరోవైపు తన సొంత ఓటు బ్యాంకును దూరం చేసుకోకుండా ఉండటం.. ఈ రెండు విభిన్న పార్శ్వాల మధ్య జగన్ మోహన్ రెడ్డి రాజకీయంగా అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

## ఏపీలో ఫ్రీహోల్డ్ భూములపై కీలక నిర్ణయం

**రాజమండ్రి,తెలంగాణ దిశ :** ఏపీలో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 7.85 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించింది. ఈ మేరకు నేడే, రేపో ఉత్తర్వులు కూడా వచ్చే అవకాశం ఉ:ది. మిగిలిన భూములకు సంబంధించి త్వరలోనే సమావేశమై చర్చించాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. త్వరలోనే ఈ ఫ్రీ హోల్డ్ భూముల అంశంపై క్లారిటీ వస్తుందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. భూముల సమస్యలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ అమరావతిలోని సచివాలయంలో సమావేశమైంది.. ప్రధానంగా ఫ్రీహోల్డ్ భూములు, 22ఏ, ఈనాం భూముల సమస్యపై చర్చించింది. ఫ్రీహోల్డ్ భూముల అంశంపై సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13.59 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు నిలిపివేయగా.. వీటిలో 7.85 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించాలనే నిర్ణయానికి వచ్చారు. మిగిలిన 5.74 లక్షల ఎకరాలపై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోవాలని తీర్మానం చేశారు

# అమ్మకానికి పాత వాహనాలు



**హైదరబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణలో పాతబడిన వాహనాలపై ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. కాలుష్యం పెరగడం, రోడ్లపై ప్రమాదాలు ఎక్కువవడం వంటి సమస్యలకు పాత వాహనాలు ఒక కారణంగా మారుతున్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసే విధానాన్ని పూర్తిగా మార్చాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు మాన్యువల్‌గా జరిగే తనిఖీలకు బదులుగా పూర్తిగా సాంకేతిక ఆధారిత వ్యవస్థను తీసుకు రావాలని తెలంగాణ రవాణాశాఖ ముందుకు వచ్చింది.ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం అయ్యాయి. మొత్తం 37 కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి జిల్లా కేంద్రంలో ఒక స్టేషన్ ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలో అదనంగా మరికొన్ని కేంద్రా లను ఏర్పాటు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.ఈ కొత్త వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి కానుంది. ఇప్పటివరకు మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్లు చేసే తనిఖీలపై అనేక విమర్శలు ఉన్నాయి. కొన్నిసార్లు పూర్తిస్థాయి పరీక్షలు లేకుండానే ఫిట్‌నెస్ పత్రాలు జారీ అయ్యేవని ఆరోపణలు వచ్చాయి. దీంతో రోడ్లపై సరిగా పనిచేయని వాహనాలు తిరుగుతున్నాయని అధికారులు గుర్తించారు. ఈ సమస్యను పూర్తిగా నివారించేందుకు ఆటోమేటెడ్ టెస్టింగ్ విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది.కొత్త విధానంలో వాహనదారులు ముందుగా ఆన్‌లై న్‌లోఫీజుచెల్లించి సమయాన్ని బుక్ చేసుకోవాలి. ఆ తర్వాత వాహ నాన్ని టెస్టింగ్ స్టేషన్‌కు తీసుకెళ్లాలి. అక్కడ అత్యాధునిక పరికరాలతో వాహనాన్ని పరీక్షిస్తారు. అన్ని పరీక్షల్లో వాహనం సరైన ప్రమాణాలు కలిగి ఉ ందని తేలితే కంప్యూటర్ వ్యవస్థే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తుంది. మొత్తం ప్రక్రియ చాలా తక్కువ సమయంలో పూర్తయ్యేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు.ఈ స్టేషన్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం ఇప్పటికే భారీ నిధులను మంజూరు చేసింది. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.296 కోట్లతో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని నిర్ణయించింది. టెండర్ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ విధానం అమల్లోకి వస్తే వాహనాల తనిఖీల్లో పారదర్శకత పెరగడంతో పాటు రోడ్లపై తిరిగే వాహనాల స్థితి కూడా మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా కాలుష్యాన్ని నియంత్రిం చడం, ప్రమాదాలను తగ్గించడం వంటి లక్ష్యాలతో ఈ కొత్త వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

# అజార్‌కు పదవీ గండం?



**హైదరబాద్:,తెలంగాణ దిశ :**అజహరుద్దీన్ ను హడావుడిగా మంత్రిని చేశారు. ఆరు నెలల్లో ఎమ్మెల్యేగానో ఎమ్మెల్సీగానో ఎంపిక కావాలి. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ వద్ద దానికి సంబంధించిన ప్లాన్ ఏ లేదా ప్లాన్ బీ ఏదీ ఉన్నట్లుగా కనిపించడం లేదు. మంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత గవర్నర్ కోటాలో ఆయన పేరును ఎమ్మెల్సీకి సిఫారసు చేశారు. విషయం కోర్టులో ఉండటంతో.. ఇంత వరకూ గవర్నర్ నిర్ణయం తీసుకోలేదు. పైగా కొత్త గవర్నర్ వస్తున్నారు. ఆయన కూడా నిర్ణయం తీసుకోకపోతే అజహర్ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది.మైనారిటీ కోటాలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజహర్, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు నెలల లోపు ఏప్రిల్ 30, 2026 నాటికి అసెంబ్లీ లేదా కౌన్సిల్ సభ్యుడిగా ఎంపిక కావాల్సి ఉంది. ఈ ప్రక్రియలో ఎదురవుతున్న న్యాయపరమైన చిక్కులు ఆయన మంత్రి పదవిని సందిగ్ధంలో పడేశాయి.అజహరుద్దీన్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేస్తూ ప్రభుత్వం గతంలోనే సిఫారసు చేసింది. అయితే, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సిఫారసు చేసిన పేర్లను గవర్నర్ తిరస్కరించడంపై దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉండటంతో, గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అజహర్ నియామకంపై నిర్ణయం తీసుకోలేకపోయారు. ఇప్పుడు కొత్త గవర్నర్ రాకతో ఈ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతానికి గవర్నర్ కోటానే ప్లాన్ ఎగా భావిస్తున్న కాంగ్రెస్ హైకమాండ్ వద్ద ప్లాన్ బిపై స్పష్టత లేకపోవడం పార్టీ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. ఒకవేళ కోర్టు తీర్పు ప్రతికూలంగా వస్తే, ఎమ్మెల్యే కోటాలో ఉన్న ఎమ్మెల్సీలలో ఒకరిని రాజీనామా చేయించి ఆ స్థానంలో అజహర్‌ను పంపే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అయితే, సిట్టింగ్ ఎమ్మెల్సీలు ఎవరైనా తమ పదవిని వదులు కోవడానికి సిద్ధంగా ఉన్నారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం వంటి ప్రత్యామ్నాయాలు చర్చకు వచ్చినా, అక్కడ ఎన్నికల నిర్వహణకు సమయం సరిపోదు.రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న మరో ఆసక్తికరమైన చర్చ ఏమిటంటే.. ఒకవేళ ఏప్రిల్ 30లోగా ఎమ్మెల్సీ పదవి దక్కకపోతే, అజహర్ మంత్రి పదవికి రాజీనామా చేసి, మళ్ళీ ఒకటి రెండు రోజుల తర్వాత తిరిగి ప్రమాణ స్వీకారం చేయడం. దీనివల్ల ఆయనకు మరో ఆరు నెలల గడువు లభిస్తుంది. అయితే, ఇలా చేయడం వల్ల ప్రభుత్వం తీవ్రమైన విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుంది. పైగా, సుప్రీంకోర్టు గతంలో ఇటువంటి పదే పదే ప్రమాణ స్వీకారాలను తప్పుబట్టిన ఉదంతాలు ఉ ఒడటంతో, ఈ నిర్ణయం తీసుకుంటే పరువు పోయే ప్రమాదం ఉ ఒదని సీనియర్లు హెచ్చరిస్తున్నారు. మైనారిటీ ప్రాతినిధ్యం కోసం హడావుడిగా అజహర్‌ను మంత్రిని చేసిన రేవంత్ రెడ్డి సర్కారు, ఇప్పుడు ఆయనను చట్టసభలకు ఎలా పంపాలనే విషయంలో సరైన ప్రణాళిక లేకపోవడంతో చిక్కుల్లో పడింది.

# సైలెంట్ మూడ్ లోకి అసంతృప్తినేతలు!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు ఒక వింతైన, అద్భుతమైన “శాంతియుత” వాతావరణం నెలకొంది. నిన్నటి వరకు గొంతు చించుకుంటూ, రేవంత్ రెడ్డి నిర్ణయాల మీద రచ్చ చేసిన ‘ఫైర్ బ్రాండ్’ నేతలంతా.. ఇప్పుడు ఎక్కడో లోతైన ధ్యానంలోకి వెళ్ళిపోయారు. రేవంత్ రెడ్డి తీసుకున్న ఒక్క ‘రాజ్యసభ’ నిర్ణయంతో, జ్ఞానోదయం కలిగింది!గతంలో కాంగ్రెస్ అంటే “ఢిల్లీ వెళ్లాలి, ఫిర్యాదు చేయాలి, వేచి చూడాలి” అనే సామెత ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. తెలంగాణ కాంగ్రెస్ దగ్గరకు వచ్చేసరికి “హైకమాండ్” అంటే సాక్షాత్తు రేవంత్ రెడ్డేనని పార్టీ నేతలందరూ సర్దిపై చేసేసుకున్నారు. వేం నరేందర్ రెడ్డిని రాజ్యసభకు పంపి, “ఢిల్లీలో నా మాటే శాసనం” అని రేవంత్ తన మార్క్ పాలిటిక్స్‌తో స్పష్టమైన మెసేజ్ ఇచ్చేశారు. ఇంకేముంది? సీనియర్లందరూ తమ అసమ్మతి ఫైళ్లను అటక మీద పెట్టేసి, ఏసీ గదుల్లో కూర్చొని “రేవంత్ జిందా బాద్” అంటూ కంఠాపాఠం మొదలుపెట్టారు.ఎప్పుడూ ఏదో ఒక సంచలనం సృష్టించే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి నేతలు సైతం, ఇప్పుడు “నోరు మెదపకపోవడమే మంచిది” అన్న యోగా సనంలో ఉన్నారు.తెర వెనుక వ్యూహాలు పన్నిన నేతలు కూడా, రేవంత్ చక్రవ్యూహం ముందు తాము కేవలం‘పావులమే’అని గుర్తించిన ట్టున్నారు. ఇప్పుడు వారికి రెండు ఆప్షన్లే ఉన్నాయి:రేవంత్ పాలనను ఆకాశానికి ఎత్తేస్తూ, మీడియా మైకుల ముందు ‘స్తుతి’ పాడటం.ఈ రెండింటిలో ఏది ఎంచుకున్నా, వారి రాజకీయ భవిష్యత్తుకు రేవంత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉందన్నది లోకల్ టాక్. ఒకప్పుడు గ్రూపు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న కాంగ్రెస్.. ఇప్పుడు రేవంత్ సారథ్యంలో ‘కార్పొరేట్ కంపెనీ’లా మారిపోయింది. టార్గెట్స్ రీచ్ అవ్వండి, లేదంటే ప్రమోషన్లు ఆగిపోతాయ్ అన్నట్టుగా ఆయన డీల్ చేస్తుంటే, సీనియర్లు అవాక్కవుతున్నారు. రేవంత్ రెడ్డి తీసుకుంటున్న దూకుడు నిర్ణయాలకు ఢిల్లీ అధిష్టానం కూడా ‘యెస్ బాస్’ అనక తప్పడం లేదు.మొత్తానికి తెలంగాణ కాంగ్రెస్‌లో ‘కలహాల’ కాలం ముగిసి, ‘రేవంత్ శకం’ మొదలైంది. అసమ్మతి నేతలు ఇప్పుడు “మాకు అసంతృప్తి లేదు.. కేవలం విశ్రాంతి తీసుకుంటున్నాం” అని చెప్పుకోవడమే ఇప్పుడున్న ఏకైక మార్గం!

# లక్ష్యం మంచిదే.. కానీ వ్యూహంలోనే లోపమా?

**హైదరబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ ప్రస్తుతం రాజకీయంగా పెను దుమా రం రేపుతోంది. చెరువుల పరిరక్షణ, మూసీ పునరుజ్జీవం వంటి ఉన్నత లక్ష్యాలతో మొదలైన ఈ ప్రస్థానం, క్షేత్రస్థాయిలో అమలు తీరు, ప్రతిపక్షాల వ్యూహాల వల్ల ప్రభుత్వానికి ప్రతికూలంగా మారుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తొలుత హైడ్రా ద్వారా హైదరాబాద్‌లోని చెరువుల ఆక్రమణలను తొలగించి ప్రజల ప్రశంసలు పొందింది. అయితే, ఆ తర్వాత పలు విమర్శలు ఎదుర్కొం ది. తాజాగా ఖమ్మం జిల్లాలో ఆక్రమణల తొలగింపు, ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు కోసం చేపడతారని ప్రచారం జరుగుతున్న కూల్చివేతలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారా యి. ఆక్రమణలు తొలగించడం చట్టబద్ధమే అయినప్పటికీ, బాధితుల ఆవేదనను ప్రతిపక్షాలు తమకు అనుకూ లంగా మార్చుకోవడంలో సఫలమవుతున్నాయి. పేదల ఇళ్లను కూల్చుతున్నారు అనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లడం కాంగ్రెస్ వ్యూహాత్మక లోపంగా కనిపిస్తోంది. ఏ ప్రభుత్వానికైనా ఆక్రమణల తొలగింపు అనేది కత్తిమీద సాము వంటిది. చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రభుత్వం చెబుతున్నా, మానవీయ కోణాన్ని విస్మరించడం వల్ల సామాన్యుల్లో అభద్రతా భావం పెరుగుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి, పేద వర్గాల ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటు న్నారనే భావన కలిగితే, అది దీర్ఘకాలంలో ఓటు బ్యాంకుపై ప్రభావం చూపుతుంది. ఖమ్మంలోనూ, హైదరాబాద్ మూసీ తీరంలోనూ బాధితుల నిరసనలు ఉధృతం కావడం, వారికి ప్రతిపక్ష నేతలు అండగా నిలవడం ప్రభుత్వానికి రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది.ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్నది అసలు కంటే కొసరు ఎక్కువ అన్నట్లుగా ఉంది. అంటే, ప్రభుత్వం చేస్తున్న పని కంటే దానిపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారమే ఎక్కువగా వినిపిస్తోం ది. ప్రభుత్వం తన ఉద్దేశాలను ప్రజలకు స్పష్టంగా వివరించడంలో వెనుకబడిందనేది రాజకీయ వర్గాల అభిప్రాయం. కూల్చివేతలకు ముందే పునరావాస ప్యాకేజీలను ప్రకటించి, ప్రజలతో మమేకమై ఉంటే ఇంతటి వ్యతిరేకత వచ్చేది కాదు. కానీ, యంత్రాలతో నేరుగా రంగంలోకి దిగడం వల్ల ప్రతిపక్షాలకు ప్రభుత్వం అస్త్రాలను అందించినట్లయింది.ప్రభుత్వ యంత్రాంగం , రాజకీయ విభాగం మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అధికారులు కేవలం నిబంధనలప్రకారమే వెళ్తారు, కానీ రాజకీయ నేతలు ప్రజల నాడిని పట్టుకోవాలి. మూసీ ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడం కంటే, కూల్చివేతల వార్తలే ఎక్కువగా హైలైట్ అవ్వడం ప్రభుత్వ వైఫల్యమే. ముందుముందు కీలక ప్రాజెక్టులు చేపట్టాలంటే ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చుకో వాలి. కేవలం కూల్చివేతలు అనే ముద్ర పడకుండా,పునర్నిర్మాణం, సుందరీకరణ అనే సానుకూల అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. బాధితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు లేదా మెరుగైన పరిహారం ఇచ్చి, తర్వాతే చర్యలు తీసుకోవడం శ్రేయస్కరం. లేనిప క్షంలో, ఈకూల్చివేతల వ్యతిరేక ప్రచారం కాంగ్రెస్ ప్రభుత్వానికి భారీ రాజకీయ మూల్యాన్ని మిగిల్చే ప్రమాదం ఉంది.

# దానం పై వేటు... పక్కా ?



**హైదరబాద్,తెలంగాణ దిశ :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటీషన్‌పై విచారణ ముగిసింది. స్పీకర్ గడ్డం ప్రసాదరావు తీర్పును రిజర్వ్ చేశారు. ఈరోజుతో అనర్హత ఎమ్మెల్యేల పిటీషన్లపై విచారణ ముగిసింది. మొత్తం పది మంది ఎమ్మెల్యేలు తమ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి మారినట్లు బీఆర్ఎస్ వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.ఇప్పటి వరకూ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాదరావు తీర్పు చెప్పారు. ఇక కడియం శ్రీహరి, దానం నాగేందర్ విషయంలోనే తీర్పు చెప్పాల్సి ఉంది. అయితే కడియంశ్రీహరి విషయంలో ఏమో గాని దానం నాగేందర్ పై మాత్రం ఖచ్చితంగా అనర్హత వేటు పడే అవకాశాలున్నాయని చెబుతున్నారు. దానం నాగేందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా అందుకు సిద్ధమయి నట్లే సమాచారం. సుప్రీంకోర్టులో కేసు ఉన్నందున దానం నాగేందర్ విషయంలో అనర్హత వేటు పడటం ఖాయమన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తుంది. సాంకేతికంగా ఆధారాలుండటం వల్లనేదానం నాగేందర్ అనర్హత వేటు నుంచి తప్పించుకోలేరని న్యాయ నిపుణులు కూడా చెబుతున్నారు. 2023 లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో గెలిచిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తర్వాత కాంగ్రెస్ పార్టీకి మద్దతుదారుగా నిలిచారు. అయితే మిగిలిన ఎమ్మెల్యేలు కూడా కండువాలు కప్పుకున్నప్పటికీ వారికి కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం మాత్రం ఇవ్వలేదు. దానం నాగేందర్ విషయం మాత్రం డిఫరెంట్.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాత్రం బీఆర్ఎస్ గుర్తుపై ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలిచి 2024 లోజరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో దానం నాగేందర్ సాంకేతికంగా కాంగ్రెస్ లో చేరినట్లేనని న్యాయనిపుణులు కూడా అభిప్రాయపడుతు న్నారు. అందుకే తొలి నుంచి దానం నాగేందర్ ఒక్కరిపై వేటు పడే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతుంది. మరొకవైపు ఇప్పటికే హైదరాబాద్ నగరంలో కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన నేపథ్యంలో ఖైరతాబాద్ కు కూడా ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉందని మాత్రం రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతుంది. అయితే అనర్హత వేటుపడినా ఆరునెలల్లో ఉప ఎన్నిక జరగాల్సి ఉంటుంది. అయితే స్పీకర్ నిర్ణయం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది..

## అల్లీపూర్ 8వ వార్డ్ లో తడి-పొడి చెత్త అవగాహన కార్యక్రమం




**రాయికల్,తెలంగాణ దిశ :**అల్లీపూర్ గ్రామం లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక’ 99 రోజుల కార్యాచరణ లో భాగంగా మండలపరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీ డీవో) చిరంజీవి అల్లీపూర్ గ్రామంలో 8వ వార్డులో ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించి, ప్రజలకు పొడి చెత్త మరియు తడి చెత్త వేరు చేయడంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఇంటి వద్దే చెత్తను వేరు చేయడం వల్ల గ్రామ పారిశుధ్యం మెరుగుపడుతుందని, వ్యాధులు దరిచేరవని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ గౌతమి – వెంకటేష్, ఇన్చార్జ్ గ్రామ కార్యదర్శి శ్రీహరి, 8వ వార్డు సభ్యులు అనుమల్ల రాజ్ కుమార్, కారోబార్ రాజేందర్ పాల్గొన్నారు. పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ కవిత, గ్రామస్థులు అనుమల్ల మల్లేశం, పొట్టవత్తిని నాగభూషణం మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## టిప్పర్ కు తగిలిన విద్యుత్ తీగలు.. లారీ దగ్ధం

నల్గొండ,తెలంగాణ దిశ :: నల్లగొండ జిల్లాలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. రోడ్డు నిర్మాణ పనుల కోసం కంకరతో వెళ్తున్న ఓ టిప్పర్ లారీకి విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగిన ఘటన కలకలం రేపింది. ఈ ప్రమాదంలో లారీ వెనుక భాగం పూర్తిగా దగ్ధమైంది. అదే సమయంలో కరెంట్ షాక్ తగలడంతో లారీ డ్రైవర్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అయితే సమీపంలో ఉన్న స్థానికులు వెంటనే స్పందించి ప్రాణాలకు తెగించి డ్రైవర్ను లారీ దగ్గర నుంచి బయటకు లాగి సురక్షిత ప్రదేశానికి తరలించారు. దీంతో పెద్ద ప్రమాదం తృటిలో తప్పినట్లైంది.ఈ ఘటన నల్లగొండ జిల్లా చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. రోడ్డు నిర్మాణ పనుల కోసం కంకర తీసుకెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తు లారీపై ఉన్న ఎత్తైన లోడుకు విద్యుత్ తీగలు తగిలినట్లు సమాచారం. ఒక్కసారిగా లారీ నుంచి మంటలు ఎగిసిపడటంతో పాటు దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. స్థానికులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి, అధికారులకు సమాచారం అందించారు. ప్రస్తుతం డ్రైవర్ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.

# విజయడైరీకి ఏపీ కష్టాలు

## పడిపోయిన నెయ్యి అమ్మకాలు




**హైదరబాద్,తెలంగాణ దిశ :** తెలుగు రాష్ట్రాల్లో దశాబ్దాలుగా పాడి రైతులకు భరోసాగా, కోట్లాది మంది వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తులకు చిరునామాగా వెలుగొందిన ‘విజయ’ బ్రాండ్ నేడు తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయింది. ఒకప్పుడు ప్రభుత్వ రంగ సంస్థగా తిరుగులేని ఆదరణ పొందిన ఈ సంస్థ, ప్రస్తుతం కల్తీ ఆరోపణలు, రాజకీయ వివాదాల సుడిగుండంలో చిక్కుకుని తన ఉనికిని కాపాడుకోవడానికి పోరాడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో మొదలైన ఈ కల్తీ వ్యవహారం, ఇప్పుడు సరిహద్దులు దాటి తెలంగాణలోని విజయ డెయిరీ ప్రతిష్టను కూడా మసకబారుస్తోంది. కేవలం కొందరి స్వార్థం కోసం దశాబ్దాల చరిత్ర కలిగిన ఒక బ్రాండ్‌ను ఫ్రాంచైజీల పేరిట ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడమే ఈ వినాశనానికి మూలకారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయ డెయిరీ కార్యకలాపాలను విస్తరించే క్రమంలో ప్రవేశపెట్టిన ఫ్రాంచైజీ విధానం అక్రమార్కులకు వరంగా మారింది. ప్రభుత్వ పర్యవేక్షణ నామమాత్రంగా మారడంతో, నాణ్యతా ప్రమాణాలను గాలికి వదిలేసి కేవలం లాభాలే ధ్యేయంగా ఫ్రాంచైజీలు పనిచేశాయి. ఈ క్రమంలోనే తక్కువ ధరకు లభించే పామాయిల్ లేదా ఇతర జంతువుల కొవ్వులను కలిపిన కల్తీ నెయ్యిని విజయ లేబుల్‌తో మార్కెట్లోకి విడుదల చేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తిరుమల లడ్డూ ప్రసాదంనెయ్యి కల్తీ వ్యవహారం వెలుగులోకి రావడంతో, అప్పట్లో సరఫరాఅయిన విజయ నెయ్యినాణ్యతపై కూడా అనుమానాలు వ్యక్తమ య్యాయి. ఈ ప్రభావం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాకుండా, పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోని విజయ ఉత్పత్తుల అమ్మకాలపై కూడా తీవ్ర ప్రభావం చూపింది.తెలంగాణలోని విజయ డెయిరీ ( లాభాల్లో ఉన్నప్పటికీ, ఏపీలో జరిగిన పరిణామాల వల్ల ఇక్కడి వినియోగదారుల్లో కూడా అభద్రతాభావం నెలకొంది. విజయ పాలు లేదా నెయ్యి అంటే కళ్ళు మూసుకుని కొనే ప్రజలు, ఇప్పుడు ఇతర ప్రైవేట్ బ్రాండ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల మార్కెట్‌లో విజయ ఉత్పత్తుల వాటా క్రమంగా తగ్గుతోంది. అమ్మకాలు పడిపోవ డంతో దాని ప్రభావం నేరుగా క్షేత్రస్థాయిలో ఉన్న పాడి రైతులపై పడుతోంది. డెయిరీకి వచ్చే పాల సేకరణ తగ్గడం వల్ల రైతులు తమ పాలను ప్రైవేట్ డైరీలకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే కాకుండా, సహకార రంగంపై రైతులకు ఉన్న నమ్మకాన్ని సడలిస్తోంది.ఈ మొత్తం వ్యవహారంలో పర్యవేక్షక లోపం స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా ప్రభుత్వ బ్రాండ్ అంటే ప్రజల్లో ఒక రకమైన భరోసా ఉంటుంది. కానీ ఫ్రాంచైజీలకు ప్యాకేజింగ్, తయారీ బాధ్యతలను అప్పగించిన ప్పుడు, ప్రభుత్వం తరపున నిరంతర తనిఖీలు నిర్వహించడంలో వైఫల్యం చెందారు. కేవలం కమీషన్ల కోసమే ప్రాధాన్యత ఇవ్వడంతో నాణ్యత అనే అంశం అప్రధాన్యంగా మారింది. ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ ముద్రను వాడుకుంటూ కల్తీకి పాల్పడటం అనేది ముమ్మాటికీ వ్యవస్థాగత వైఫల్యమే. రాజకీయ నాయకుల అండదండలతోనే ఇటువంటి అక్రమాలు సాధ్యమవుతాయని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఇక్కడి దాకా వచ్చిందని విమర్శలు వస్తున్నాయి.ప్రస్తుత తరుణంలో విజయ బ్రాండ్ తన పూర్వవైభవాన్ని సంతృప్తి పరుచుకోవాలంటే సమూలమైన మార్పులు అవసరం. రాజకీయాలకు అతీతంగా, కల్తీకి పాల్పడిన ఫ్రాంచైజీల లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. అలాగే తెలంగాణ ప్రభుత్వం కూడా తన డెయిరీ ఉత్పత్తుల నాణ్యతను నిరూపించుకోవడానికి అత్యాధునిక ల్యాబ్‌ల ద్వారా ప్రతి బ్యాచ్‌ను పరీక్షించి, ఆ రిపోర్టులను బహిరంగం గా అందుబాటులో ఉంచాలి. సహకార రంగాన్ని కాపాడుకోవడం అంటే కేవలం ఒకసంస్థను కాపాడుకోవడం కాదు, దాని వెనుక ఉన్న లక్షలాది మంది రైతుల జీవనోపాధినికాపాడటమే. ప్రభుత్వంతక్షణ మే స్పందించి గట్టి చర్యలు తీసుకోకపోతే, అద్భుతమైన చరిత్ర కలిగిన విజయ బ్రాండ్ కేవలం ఒక జ్ఞాపకంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# ఇంతవరకూ ఒక్క హిట్టు పడలేదు



ఎవరు ఏ రంగాన్ని ఎంచుకున్నప్పటికీ, అందులో రాణించాలంటే ప్రతిభ ఉండాలి. టాలెంట్ ఒక్కటి ఉంటే సరిపోతుందా అంటే, కొంచెం అదృష్టం కూడా ఉండాలనుకోండి అనే సమాధానం వస్తుంది. అదృష్టం అనే విషయంలో ఎవరి అభిప్రాయాలు వాళ్లకి ఉంటాయి. కాకపోతే అదృష్టం అనే దాని గురించి అప్పుడప్పుడు నమ్మవలసి వస్తుంటుంది. అందుకు కారణాలు.. కళ్లముందు కనిపించేవే అని చెప్పాల్సి ఉంటుంది. ఆశించినస్థాయిలో గుర్తింపు రానప్పుడు .. విజయాలు అందనప్పుడు .. అదృష్టం లేదని చెప్పుకుంటూ ఉంటారు. అలాంటి అదృష్టాన్ని వెతికి పట్టుకునే పనిలో ఉంటారు. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే అదే పనిలో ఉందని అంటున్నారు. ఇప్పుడున్న కథానాయికలలో గ్లామరస్ బ్యూటీ ఎవరంటే కుర్రకారు ఠకీమని చెప్పే మాట భాగ్యశ్రీ బోర్సే. తుమ్మెదల్లాంటి కళ్లతో మనసులు దోచే ఈ సుందరికి ఇంతవరకూ హిట్టు పడలేదు. ఆమె అభిమానులు బెంగపెట్టుకోవడంలోని అసలు కారణం ఇదే. ఈ నేపథ్యంలో ఆమె అఖిల్ సరసన నాయికగా 'లెనిన్' సినిమా చేస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను, అన్నపూర్ణ – సితార సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'మే'లో ఈ సినిమాను విడుదల చేసే ఆలోచనలో ఉన్నారు. తమన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. భాగ్యశ్రీ గ్లామర్ ఈ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తుందని అంటున్నారు. ఈ సినిమాతోనైనా ఆమెకి అదృష్టం కలిసొస్తుందేమో చూడాలి మరి.

# డబుల్ ఫన్.. 'హాట్ స్పాట్ 2 మచ్'..



సమాజంలో జరుగుతున్న వాస్తవ సంఘటనలను ఆధారంగా చేసుకుని, ఆలోచింపజేసే కథాంశాలతో ఈ సీక్వెల్‌ను రూపొందించారు. కేవలం వినోదం మాత్రమే కాకుండా, సమాజంలోని కొన్ని సున్నితమైన అంశాలను ఎత్తిచూపుతూ ఈ సినిమా ఉండబోతోందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా.., ఎం.ఎస్. భాస్కర్, తంబి రామయ్య, అశ్విన్ కుమార్, ఆదిత్య భాస్కర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిల్ రెడ్డి ఎం, ముని చంద్రారెడ్డి ఎన్, ఇందుకుమార్ ఎం. నిర్మించారు. ఈ చిత్రం నేడు నేరుగా 'ఆహా' వేదికగా విడుదలయ్యింది. మొదటి భాగం సృష్టించిన ఇంపాక్ట్‌తో, ఈ సీక్వెల్‌పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. బోల్డ్ అండ్ సోషల్ మెసేజ్ ఓరియెంటెడ్ కథలను ఇష్టపడే ప్రేక్షకులకు 'హాట్ స్పాట్ 2 మచ్' ఒక మంచి ఆప్షన్ కానుంది.

2024లో బాక్సాఫీస్ వద్ద, ఓటీటీలో వైవిధ్యమైన కంటెంట్‌తో సంచలనం సృష్టించిన చిత్రం 'హాట్ స్పాట్'. ప్రముఖ తెలుగు స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ 'ఆహా'లో విడుదలై, విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను దక్కించుకుంది. ఇప్పుడు అదే ఉత్సాహంతో, ప్రేక్షకులకు రెట్టింపు వినోదాన్ని పంచడానికి సిద్ధమైంది దీని సీక్వెల్ 'హాట్ స్పాట్ 2 మచ్'. విలక్షణ దర్శకుడు విఘ్నేష్ కార్తిక్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సమకాలీన

# మాస్ హీరో బాలయ్యతో వివేక్ ఆత్రేయ..




వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న నందమూరి బాలకృష్ణ, ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విభిన్నమైన కథా చిత్రాల దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయతో బాలయ్య ఓ సినిమా చేయబోతున్నారనే వార్త టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ అనూహ్యమైన కాంబినేషన్‌పై ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. బ్రోచేవారెవరురా, cఅంటే సుందరానికిc వంటి క్లాస్ చిత్రాలతో తనకంటూ ఓ ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్న వివేక్ ఆత్రేయ, ఈసారి తన పంథాకు భిన్నంగా బాలయ్య మాస్ ఇమేజ్‌కు సరిపోయే భారీ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ కథ స్పాన్ చాలా పెద్దదిగా ఉండటంతో దీనిని ఒకే సినిమాగా కాకుండా రెండు భాగాలుగా తెరకెక్కించాలా? అనే విషయంపై దర్శకనిర్మాతలు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టును ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుందని టాక్ వినిపిస్తోంది. మాస్ హీరోను క్లాస్ చిత్రాల దర్శకుడు ఎలా ప్రెజెంట్ చేస్తాడనే కుతూహలం అభిమానుల్లో, సినీ వర్గాల్లో నెలకొంది. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. బాలయ్య ప్రస్తుతం దర్శకుడు గోపీచంద్ మలినేనితో ఓ సినిమాకు సిద్ధమవుతున్నారు. ముందుగా ఈ చిత్రాన్ని పీరియాడికల్ డ్రామాగా, బాలయ్యను మహారాజుగా చూపించాలని అనుకున్నప్పటికీ.. బడ్జెట్ కారణాల వల్ల కథలో మార్పులు చేశారు. తాజా సమాచారం ప్రకారం ముంబై మాఫియా నేపథ్యంలో సాగే కథలో బాలయ్య పవర్‌ఫుల్ డాన్‌గా కనిపించనున్నారు. ఈ సినిమా మార్చి 5న పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుండగా, దసరాకు విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒకవైపు గోపీచంద్ మలినేనితో పక్కా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్, మరోవైపు వివేక్ ఆత్రేయతో ప్రయోగాత్మక భారీ చిత్రం ఉండటంతో బాలయ్య లైనప్ ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తి రేపుతోంది. తన కెరీర్‌లోనే అత్యంత భారీ కథతో రాబోతున్న వివేక్ ఆత్రేయ, బాలయ్యను ఏ స్థాయిలో చూపిస్తారో చూడాలని అందరూ ఎదురుచూస్తున్నారు.


## మొన్న సౌత్ ఇండస్ట్రీపై విమర్శలు, ఇప్పుడు ప్రశంసలు..

# తాప్సీ పన్నూ 'యూటర్న్'పై చర్చ



సౌత్ సినిమాలతో కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత బాలీవుడ్‌లో స్థిరపడిన హీరోయిన్లలో తాప్సీ పన్ను ఒకరు. తెలుగు చిత్రాలతో గుర్తింపు తెచ్చుకుని, తర్వాత హిందీ సినిమాల్లో వరుస అవకాశాలు అందుకున్న ఆమె× ఇటీవల చేసిన వ్యాఖ్యలు మళ్లీ సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. తాప్సీ తెలుగు ఇండస్ట్రీలో అడుగుపెట్టింది ఝుమ్మంది నాదం చిత్రంతో. దర్శకుడు కె. రాఘవేంద్రరావు తెరకెక్కించిన ఈ సినిమా ద్వారా ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత పలు తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. తెలుగులో వచ్చిన విజయాలే ఆమెకు బాలీవుడ్ వైపు అడుగులు వేసేలా చేసాయని సినీ విశ్లేషకుల అభిప్రాయం. అక్కడ కూడా కథానాయికగా కాకుండా, కంటెంట్ ఆధారిత సినిమాలతో నటిగా తనను నిరూపించుకునే ప్రయత్నం చేసింది. అయితే కొద్ది రోజుల క్రితం బాలీవుడ్‌లో ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తన తొలి తెలుగు సినిమా సమయంలో వర్క్ ఎక్స్‌పీరియన్స్ గురించి కొంత హేళనగా మాట్లాడినట్టు వార్తలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, తెలుగు ప్రేక్షకుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. సౌత్ సినిమాల వల్లే గుర్తింపు తెచ్చుకున్న నువ్వు, ఇప్పుడు అదే ఇండస్ట్రీపై వ్యాఖ్యలు చేయడం సరైంది కాదు అంటూ పలువురు నెటిజన్లు మండిపడ్డారు. ట్రోల్స్ కూడా పెద్ద ఎత్తున వచ్చాయి. దీంతో తాజాగా మరో ఇంటరాక్షన్‌లో తాప్సీ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తన కెరీర్‌లో తెలుగు సినిమాల పాత్రను ప్రశంసించినట్టు తెలుస్తోంది. కోలీవుడ్ సినిమాల కంటే, తెలుగు ఇండస్ట్రీ వల్లే తనకు ఎక్కువ ఆదరణ, గుర్తింపు వచ్చిందని ఆమె చెప్పినట్టు సమాచారం. ఈ వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో మరోసారి చర్చ మొదలైంది. కొందరు "తప్పు గ్రహించి మాట్లాడింది, మంచిదే" అంటుంటే, మరికొందరు "ఇది కేవలం ఇమేజ్ డ్యామేజ్ కంట్రోల్ మాత్రమే" అంటూ విమర్శిస్తున్నారు. సెలబ్రిటీల వ్యాఖ్యలు ఎప్పుడూ చర్చకు దారితీయడం సహజం. ముఖ్యంగా ఒక ప్రాంతంలో విజయాలు సాధించి, తర్వాత ఆ ఇండస్ట్రీపై చేసిన వ్యాఖ్యలు అభిమానులను బాధపెడతాయి. ఇప్పుడు తాప్సీ చేసిన ప్రశంసలను కొందరు సానుకూలంగా స్వీకరిస్తుంటే, మరికొందరు ఆమెని నమ్మడం లేదు. జరిగిన డ్యామేజ్ జరిగిపోయింది× ఇప్పుడు మాట్లాడితే సరిపోతుందా? అని అంటున్నారు.

# రెండు భాగాలుగా రానున్న 'స్వయంభు'



యువ హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా స్వయంభుపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 2026 ఏప్రిల్ 10న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించడంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది.

తాజాగా ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నట్లు నిఖిల్ స్వయంగా వెల్లడించడం విశేషం. కథ, విజువల్ గ్రాండియర్ దృష్ట్యా 'స్వయంభు'ను రెండు పార్ట్‌లుగా తీసుకురావాలని చిత్ర బృందం నిర్ణయించింది. ఈ ప్రకటనతో అభిమానుల్లో ఆసక్తి మరింత రెట్టింపైంది. ఈ సినిమాలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్ , నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్, భావోద్వేగాలతో కూడిన కథగా ఈ చిత్రం రూపొందుతోంది. భారీ బడ్జెట్‌తో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో సినిమా రూపొందుతున్నట్లు సమాచారం. 'స్వయంభు'తో పాటు నిఖిల్ చేతిలో మరికొన్ని క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. దర్శకుడు చందూ మొండేటి తెరకెక్కిస్తున్న సెన్సేషనల్ సీక్వెల్ కార్తికేయ 3పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. అలాగే రామ్ వంశీ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న ది ఇండియా హౌస్ చిత్రం కూడా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ చిత్రాలు నిఖిల్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే అవకాశముంది. కేవలం వెండితెరపైనే కాకుండా,

ఇప్పుడు నిఖిల్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై కూడా తన ముద్ర వేయడానికి సిద్ధమవుతున్నాడు. త్వరలోనే ఒక వెబ్ సిరీస్‌తో ఓటీటీ ఎంట్రీ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించాడు. విభిన్న కథాంశాలు, కొత్త కాన్సెప్ట్‌లతో ముందుకు సాగుతున్న నిఖిల్, తన కెరీర్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లే దిశగా అడుగులు వేస్తున్నాడు. 'స్వయంభు'తో పాటు వరుస ప్రాజెక్టులతో నిఖిల్ సిద్ధార్థ్ తన పాన్ ఇండియా స్టార్ ఇమేజ్‌ను మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నంలో ఉన్నాడు. ఇక రెండు భాగాలుగా రానున్న 'స్వయంభు' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

# బాలీవుడ్ వర్సెస్ టాలీవుడ్

హైదరాబాద్,: సినిమా ఇండస్ట్రీలో సక్సెస్ లను సాధించిన హీరోకి క్రేజ్ భారీ రేంజ్ లో మార్కెట్ ఉంటుంది. వాళ్ల నుంచి వచ్చిన సినిమాలను ప్రేక్షకులు అలరించడమే కాకుండా వాళ్ళు కనిపిస్తే చాలు వాళ్ళతో ఫోటోలు దిగడానికి కూడా ఎగబడిపోతుంటారు. ఇక ఇలాంటి క్రమంలోనే మన హీరోలు గత 10 సంవత్సరాల క్రితం వరకు తెలుగు సినిమాలకే పరిమితమయ్యారు. కానీ ఎప్పుడైతే బాహుబలి సినిమా వచ్చిందో అప్పటినుంచి పాన్ ఇండియా స్థాయిలో మన హీరోలు సినిమాలను చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు? ఇక ఇప్పటివరకు మన హీరోలు టాప్ లో ఉండాలనే ఆలోచిస్తున్నారు. కానీ బాలీవుడ్ హీరో అయిన రణ్వీర్ సింగ్ దూరంధర్ సినిమాతో సైతం 1000 కోట్ల మార్కెట్ ను దాటేశాడు. అలాంటి సందర్భంలో వారిని తక్కువ అంచనా వేసి చూడకూడదు.మన ప్రయత్నంలో మనం ఉండాలి అలాగే వాళ్ళ కంటే బెటర్ సినిమాలను చేసి సూపర్ హిట్లను సాధించడానికి తీవ్రమైన కృషి చేయాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన కూడా మళ్లీ మన హీరోలు బీట్ చేసి వాళ్ళు ముందుకు దూసుకెళ్లే ప్రమాదం కూడా ఉంది?కాబట్టి ప్రతి విషయంలో మన వాళ్ళు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తే మంచిదని మరి కొంతమంది సినిమా మేధావులు సైతం మన హీరోలను, తద్వారా వీళ్ళకంటూ ఒక ఐడెంటిటీ క్రియేట్ అవుతుందా? లేదా అనేది తెలియాలంటే మాత్రం మరికొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే? ఖాన్ త్రయం పని అయిపోయినప్పటికి నెక్స్ట్ జనరేషన్ బాలీవుడ్ హీరోలందరు కూడా మంచి కాన్సెప్ట్ లను ఎంచుకొని సినిమాలు చేస్తున్నారు. కాబట్టి మన హీరోలు సైతం చాలా చాకచక్యంగా వ్యవహరిస్తూ కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలను చేస్తూ తెలుగు ఇండస్ట్రీ స్థాయిని పెంచాల్సిన పరిస్థితి అయితే ఏర్పడింది? ఇక ఏది ఏమైనా కూడా ఇండియాలో ఇప్పుడున్న స్టార్ డైరెక్టర్లందరు మన హీరోల వైపే మొగ్గుచూపుతున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215